RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 309 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 నవంబర్ 2024 శనివారం పేజీలు : 4

## రైళ్లలో ఆహారం సరఫరాకు క్లౌడ్ కిచెన్లు

ముంబై : రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికులకు క్లౌడ్ కిచెన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ప్రస్తుతం రైళ్లలో ఆహార సరఫరా కోసం పెద్ద పెద్ద రైల్వే స్టేషన్ల దగ్గర బేస్ కిచెన్లు ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది కోసం ఆహారాన్ని వండి, ప్యాకింగ్ చేసి రైళ్లలో అందజేస్తున్నారు. వీటిని ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తోంది. అయితే, బేస్ స్టేషన్లలో పరిశుభ్రత పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. దీంతో, ఐఆర్‌సీటీసీ క్లౌడ్ కిచెన్లపై దృష్టి సారించింది. ఇవి ప్రైవేటు ఆపరేటర్ల నియంత్రణలో ఒప్పందం ప్రకారం నడుస్తాయి. సాధారణంగా ఈ ఒప్పందం ఏడేళ్ల పాటు ఉంటుంది. ప్రైవేటు క్యాటరింగ్ సంస్థలు ఆహారాన్ని వండి రైళ్లలో అందజేయాల్సి ఉంటుంది.

# ప్రారంభోత్సవాలు... శంకుస్థాపనలు....




## ప్రజా పాలన విజయోత్సవాలకు పక్కా ప్రణాళిక!

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 9 వరకు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లలో ప్రభుత్వం నిమగ్నమైంది. పరిపాలన పరంగా సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. ఈ వేడుకల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శాఖలవారీగా కార్యక్రమాల ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీల నిర్వహణతోపాటు అన్ని స్థాయుల విద్యార్థులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల ప్రకారం సంబంధిత మంత్రుల సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆయా జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు.

**ముఖ్యాంశాలు ఇలా...** ప్రజా పాలన విజయోత్సవాలలో రాష్ట్రంలో కొత్తగా 26 నియోజకవర్గాలకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాలకు భూమి పూజ నిర్వహిస్తారు. గ్రామీణ క్రీడా ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ నేతృత్వంలో ఒకటి నుంచి ఏడో తేదీ వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ పోటీలను నిర్వహిస్తారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 16 కొత్త నర్సింగ్ కళాశాలలతోపాటు 28 పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తారు. 213 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ తదితర సేవలకు ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకుంటామని, ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ఇటీవల సీఎం ప్రకటించారు. ఈ క్రమంలో విజయోత్సవాల్లో వాలంటీర్లుగా నియమిస్తారు. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవనానికి పునాది రాయి వేస్తారు. అటవీ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం కల ఒక యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. వివిధ ప్రాంతాల్లో 237 సరఫరా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా ప్రభుత్వం తలపెట్టిన క్రీడా విశ్వవిద్యాలయానికి భూమిపూజ చేస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికలకు ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్గొండ ఏటీసీలను ప్రారంభిస్తారు.

ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాటు, ఇతరత్రా ఒప్పందాలు చేసుకుంటారు. నగరంలోని గోషామహల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి భూమి పూజ చేస్తారు. ఆరాంఘర్ జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ప్రారంభిస్తారు. హెచ్‌సీఐటీఐ ప్రాజెక్టులో భాగంగా చేపట్టే వివిధ పనులకు భూమిపూజ చేస్తారు. కేబీఆర్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్‌లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో ఆరు జంక్షన్‌లను అభివృద్ధి చేసేందుకు రూ.826 కోట్లతో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడతారు. శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్ ప్రారంభిస్తారు.



## తుపాకీ రాముడి తుప్పును తొందరలోనే వదలగొడతారు..

### సీఎం రేవంత్‌పై ఎర్రబెల్లి సెటైర్లు

తెలంగాణ ఉద్యమ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు. తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కానీ ఇవాళ తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డలపై తుపాకీ పట్టుకుని తిరిగి.. నేడు తుపాకీరాముడు ముచ్చట్లు చెబుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి మండిపడ్డారు. త్వరలోనే తుపాకీ రాముడి తుప్పును ప్రజలు వదలగొడతారని విమర్శించారు.

## 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో': హరీష్ రావు




హైదరాబాద్: దీక్షా దివస్ ... నవంబరు 29న బీఆర్ఎస్ జరుపుకునే దీక్షా దివస్ మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపుతిప్పి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన రోజు.. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ తెగించిన రోజు అని.. తెలంగాణ ప్రజలే శ్వాసగా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఉద్యమం సాగించి.. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సందర్భం అని.. ఇన్నేళ్ళు గడిచినా ఆ నాటి పరిస్థితులు ఇంకా తన ముందు కదలాడుతూనే ఉన్నాయని.. కేసీఆర్ చిత్తశుద్ధి, నిబద్ధత వల్లే రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన 'The Coalition Years: 1996–2012' పుస్తకంలో కేసిఆర్ నిబద్ధత గురించి ఇలా ప్రస్తావించారని హరీష్ రావు అన్నారు. "కేంద్ర మంత్రిగా మీకు ఏ శాఖ కేటాయించాలి అని అడిగినప్పుడు కేసీఆర్ ఇచ్చిన సమాధానం.. ప్రణబ్‌జీ, నా లక్ష్యం మీకు తెలుసు. నాకు ప్రత్యేక తెలంగాణ కావాలి. మీరు నాకు ఏ శాఖను కేటాయించారనేది ముఖ్యం కాదు. మీరేది కేటాయించినా నాకు సమ్మతమే. కానీ దయచేసి తెలంగాణను ఇవ్వండి." ఇదీ కేసీఆర్ అంటే. ఇదీ ఆయన కమిట్మెంట్.. కేసీఆర్ త్యాగాల ఫలం తెలంగాణ. కేసిఆర్ ఉద్యమ ఫలితం తెలంగాణ అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

**మూసీపై బహిరంగ చర్చకు సిద్ధం: హరీష్ రావు :** తెలంగాణ ప్రజలతోపాటు పార్లమెంటును సైతం సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందన్నారు. కేంద్రాన్ని, పార్లమెంటును తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. మూసీపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని.. ఎక్కడకు రావాలో రేవంత్‌రెడ్డి చెప్పాలని సవాల్ విసిరారు. మూసీపై అఖిలపక్షాన్ని చర్చలకు పిలుస్తానన్న సీఎం తోక ముడిచారని ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. సీఎంపై పార్లమెంట్‌లో హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెడతామని, మూసీపై బాధితుల పక్షాన శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మరింత మెరుగ్గా 2014లో భూసేకరణ చట్టం తెచ్చామని, అదే రాష్ట్రంలో అమల్లో ఉందని చెప్పారు. దానిప్రకారం ఎన్యుమరేషన్ జరగలేదని, పీడీ నోటిఫికేషన్ ఇవ్వలేదని, డీపీఆర్ సిద్ధం చేయలేదని, లబ్ధిదారులను గుర్తించలేదని హరీశ్ ఆరోపించారు. రంగనాయకసాగర్ దగ్గర ఇరిగేషన్ భూములు ఆక్రమించానంటూ తనపై సీఎం నిరాధార ఆరోపణలు చేయడం తగదని హరీశ్ అన్నారు. ఒక గుంట భూమిని కూడా తాను ఆక్రమించలేదని..నిబంధనలకు లోబడి భూమిని కొనుగోలు చేశానని చెప్పారు. భూఆక్రమణల చరిత్ర రేవంత్‌రెడ్డికే ఉందని, ఆక్రమణల్లో మునిగి తేలే ఆయనకు అందరూ దొంగల్లానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. తనపై ఆరోపణలు చేసిన సీఎం.. ఎప్పుడు వస్తారో చెబితే ఆ భూమి దగ్గరే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

**6,213 పాఠశాలలు మూసేందుకు కుట్ర :** ఏడాది పాలనలోనే రాష్ట్రంలో 6213 పాఠశాలలను మూసివేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తోందని హరీశ్ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

ప్రతి చిన్న గ్రామానికి ప్రాథమిక, ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీశారు. ఏడాది కాకముందే జీరో స్కూల్ పేరిట 1,899 బడులు, 10 మంది లోపు విద్యార్థులున్న 4,314 స్కూళ్లను మూసివేసే ప్రణాళికలో భాగంగానే 5,741 మంది టీచర్లను బదిలీ చేస్తున్నారని హరీశ్ ఆరోపించారు.

# వృద్ధులు, మహిళలకు గుడ్ న్యూస్..




## పింఛన్ల పెంపుపై సర్కార్ కీలక నిర్ణయం?

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన సిక్స్ గ్యారంటీస్‌లో నుంచి రైతు భరోసా, ఆసరా పింఛన్ల పెంపును అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఈ రెండు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సర్కారు ఆలోచిస్తున్నట్లు తెలుస్తున్నది.

లేదంటే క్షేత్రస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యే ప్రమాదం ఉండడంతో ప్రభుత్వం అలర్ట్ అయి ఈ డెసిషన్ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే రైతుభరోసా అమలు చేయకపోవడంతో రైతులు, పింఛన్లు పెంచకపోవడంతో మహిళలు అసంతృప్తిగా ఉన్నారన్న టాక్ పార్టీ వర్గాల్లో ఉన్నది. కులగణన సర్వేలో పాల్గొంటున్న ఎన్యూమరేటర్లను సైతం ప్రజలు రైతు భరోసా ఎప్పుడిస్తారు..? పింఛన్లు ఎప్పుడు పెంచుతారు..? అనే క్వశ్చన్ చేస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆ రెంటిండిని అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే మొదటికే మోసం వస్తుందని.. ఎలక్షన్స్‌కు ముందే అమలు చేస్తే రైతులు, మహిళల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ ఉంటుందని భావిస్తున్నట్లు తెలిసింది.

**అసెంబ్లీలో భరోసాపై డిస్కషన్ :** వచ్చే నెల రెండో వారంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే రైతు భరోసాపై ప్రత్యేకంగా చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్ని ఎకరాల వరకు భరోసా ఇవ్వాలి? అనే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే విస్తృతంగా అభిప్రాయాలు సేకరించింది.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అన్ని జిల్లాల్లో పర్యటించి, రైతులు, రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది.

అదే విధంగా అసెంబ్లీలో ప్రత్యేక చర్చ ద్వారా అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత రైతుభరోసా విధివిధానాలు ప్రకటించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. ఇటు సర్వే సైతం ఈ నెల చివరి వరకు ముగియనుంది. ఆ తర్వాత రాష్ట్రంలో బీసీ జనాభా ఏ మేరకు ఉందనేది క్లారిటీ వస్తుంది. అలాగే లోకల్ బాడీలో రిజర్వేషన్లు సైతం ఫైనల్ కానున్నాయి.

సంక్రాంతి తరువాత లోకల్ బాడీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే చాన్స్ ఉండడంతో ఈ లోపే రైతుభరోసా ఇచ్చి తీరాలనే టార్గెట్‌లో ప్రభుత్వం ఉన్నట్టు ఓ మంత్రి అభిప్రాయపడ్డారు.

## సంపాదకీయం

# ఆంధ్రుల సెంటిమెంట్ ప్రత్యేక హోదా నోటి మాటనా ?

నోటి మాట అంటే తేలికగా ఎవరైనా తీసుకుంటారు. ఇది కలియుగం. కాగితాలకు ఉన్న విలువ ప్రాణం ఉన్న మనిషి చెబితే ఉండదు. ఇపుడు ఏపీకి ప్రత్యేక హోదా విషయం కూడా కేవలం నోటి మాట అని కేంద్రం అంటోంది. ఆ విషయాన్ని కేంద్రం హైకోర్టుకు తెలియచేసింది. ఏపీకి ప్రత్యేక హోదా అన్న హామీని కేవలం మౌఖికంగా మాత్రమే ఇచ్చామని రాతపూర్వకంగా ఇవ్వలేదని కేంద్రం హైకోర్టుకు నివేదించడం ఇపుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన మాటలు గత పదేళ్ళుగా నేరవేరలేదు. అవి నీటి మూటలు అయ్యాయని అంతా అనుకుంటున్నదే. దీని మీద విశాఖకు చెందిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. దానికి కేంద్రం తన స్పందనను తెలియచేస్తూ నోటి మాట అని చెప్పడం పట్ల హాట్ డిబేట్ అయితే సాగుతోంది. అయితే ప్రత్యేక హోదా విషయంలో 2014 నుంచి కేంద్రం ఏమేమి చెప్పింది అన్నది అయిదు కోట్ల ఆంధ్రులతో పాటు దేశమంతా చూసారని అంటున్నారు. ఆనాడు ఉమ్మడి ఏపీ నుంచి ఏపీని విడగొట్టినపుడు రాజధాని కూడా లేదు. ఆర్థికంగా నిధులు అందించే నగరాలు కూడా ఏపీకి లేవు. దాంతో పాటుగా 90 వేల కోట్ల రూపాయల రెవిన్యూ లోటుతో ఏపీ ఏర్పాటు అయింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని నాటి యూపీఏ ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా అయిదేళ్ల పాటు ఇస్తామని ప్రధాని హోదాలో ఆయన అధికారికంగా దేశ అత్యున్నత చట్ట సభలో చేసిన ప్రకటన అది. ప్రధాని చేసిన ప్రకటన నోటి మాట ఎలా అవుతుంది అన్నది ఇపుడు అంతా ప్రశ్నిస్తున్న విషయం. ఇక ప్రధాని అయినా ముఖ్యమంత్రి అయినా ఒక ప్రకటన చేస్తే అది జీవోతో సమానం అన్నది కూడా అంతా భావిస్తూ ఉంటారు. ఎందుకంటే వారు చెప్పేది ఎపుడూ అధికారికంగానే ఉంటుంది. అలాగే రికార్డు అవుతుంది. పైగా ప్రధాని చెప్పిన సందర్భం ఆయన ప్రసంగించిన సభ అన్నీ చూసుకుంటే కచ్చితంగా యూపీఏ ప్రభుత్వం నాడు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పింది ఇక ఎన్నికలు రావడం ప్రభుత్వాలు రావడం పోవడం అన్నది ప్రజాస్వామ్యంలో భాగం. కేంద్ర ప్రభుత్వం అన్నది శాశ్వతం. ఒక ప్రధాని ఇచ్చిన హామీని మరో ప్రధాని ఎవరు వచ్చినా అమలు చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంటుంది. అలా చూసుకుంటే నిండు సభలో మన్మోహన్ ప్రధాని హోదాలో చేసిన ప్రకటన నోటి మాట ఎలా అవుతుంది అని అంతా ప్రశ్నిస్తున్నారు. ఇవన్నీ పక్కన పెడితే గతంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేకపోవడానికి కారణం 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు అడ్డంకిగా మారడం అని కేంద్రం చెప్పింది. ఇపుడు చూస్తే హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో మౌఖికంగా చెప్పామని తప్పించి ప్రత్యేక హోదా రాతపూర్వక హామీ కాదని అంటున్నారు. దీనిని అంతా ఆసక్తిగానే చూస్తున్నారు. ఒక దేశ ప్రధాని పార్లమెంట్ లో చేసిన ప్రకటనకు విలువ లేదా అని కూడా మేధావులూ ప్రజాస్వామ్య ప్రియులు ప్రశ్నిస్తున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కేంద్రం ఇచ్చి తీరాల్సిందే అని మరోసారి డిమాండ్ వస్తోంది. ఇది సున్నితమైన అంశమని భావోద్వేగాలకు సంబంధించిన వ్యవహారం అని అంటున్నారు. ఏపీ మళ్లీ పునర్ నిర్మాణం కావాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే అని అంతా అంటున్నారు. ప్రభుత్వం చేసినా ప్రధాని చేసిన అవి మౌఖికంగానే అయినా కూడా అధికారికమే అవుతాయి తప్ప అందులో వేరే విధంగా ఉండదని కూడా నిపుణులు అంటున్నారు.

# అత్యవసరానికి ఇబ్బందే!



జగిత్యాల : బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా జగిత్యాలను తీర్చిదిద్దేందుకు బల్దియా 2022లో పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలు వెచ్చించి శౌచాలయాలను ఏర్పాటు చేసింది. కరీంనగర్‌రోడ్డులో తితిదే స్థలం, రిజిస్ట్రారు కార్యాలయం, అటవీశాఖ కార్యాలయం, పాతబస్టాండు, ఎడ్ల అంగడి, మహిళా డిగ్రీ కళాశాల పక్కన, మంచినీళ్లబావి ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. టీఎల్‌ఎఫ్(టౌన్‌లెవల్ ఫెడరేషన్)కు ఒక్కో శౌచాలయం నిర్వహణకు రూ.10 వేల చొప్పున కేటాయించి వాటి బాధ్యత అప్పగించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలున్నాయి. పట్టణానికి వచ్చే వేలాది మందికి ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు.

ఆర్భాటంగా ప్రారంభం..

శౌచాలయాలను బల్దియా అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకముందే ప్రారంభించి వెంటనే తాళాలు వేయడంతో 6 నెలలకుపైగా వినియోగానికి నోచుకోలేదు. మరోవైపు కొన్నింట్లో నిర్మాణ లోపాలు తలెత్తాయి. దీనిపై సర్వత్రా విమర్శలు తలెత్తడంతో గతేడాది పురపాలక ఆమోదంతో మరమ్మతు చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. రెండు శౌచాలయాలను వివిధ కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అటవీశాఖ ముందున్న శౌచాలయాన్ని ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏర్పాటు చేశారు.

అన్నింటినీ మూసేశారు..

పట్టణంలోని 6 శౌచాలయాలను 10 నెలల నుంచి మూసేశారు. నిర్వహణ వ్యయం చెల్లించకపోవడంతోనే మూసివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శౌచాలయాలు పూర్తిగా మూసి ఉండటంతో పట్టణానికి వచ్చే వేలాది మంది మూత్రవిసర్జనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం పట్టణానికి వచ్చే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పురపాలక కార్యాలయంలోని మూత్రశాల కూడా నిర్వహణపరమైన ఇబ్బందులతో మూసివేయడంతో సందర్శకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నిర్మించిన శౌచాలయాలు ప్రజలు అవసరాలు తీర్చడంలో విఫలమవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కౌన్సిల్ ఆమోదం లేక నిలిచిపోయింది

– చరణ్, ఏఈ, జగిత్యాల పురపాలిక

10 నెలలుగా శౌచాలయాలు మూసి ఉండటం వాస్తవమే. గత ఫిబ్రవరిలో శౌచాలయాల నిర్వహణకు తీర్మానం ప్రవేశపెట్టినా కౌన్సిల్ ఆమోదించలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో తరువాత చర్చిద్దామని అత్యసర సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. తాజాగా టీఎల్‌ఎఫ్ సంస్థకే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానమైంది. త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన వెంటనే శౌచాలయాలను అందుబాటులోకి తెస్తాం.

# వంతెనల నిర్మాణాలకు మోక్షం



మెట్‌పల్లి : కోరుట్ల పట్టణ శివారులోని జంబిగద్దె వద్దనున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులను 2017 జనవరిలో రూ.2.80 కోట్ల నాబార్డు నిధులతో ప్రారంభించారు. వాగులో పిల్లర్లు, చెక్‌డ్యాం కోసం వాల్ నిర్మించి వదిలేశారు. తర్వాత సంబంధిత అధికారులు అదనపు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గతేడాది ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి ఏడున్నరేళ్లు గడుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతోనైనా పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణం జరిగితే పట్టణ, కోరుట్ల, కథలాపూర్ మండలాల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

కోరుట్ల మండలంలోని ఏఖీన్‌పూర్ శివారులోని పెద్దవాగుపై 2017లో నాబార్డు నిధులు రూ.2.12 కోట్లతో వంతెన, చెక్‌డ్యాం నిర్మాణం పనులు ప్రారంభించి పిల్లర్లు నిర్మించారు. 2021లో రూ.2 కోట్ల నిధులు కేటాయించడంతో స్లాబ్‌వేసి ఇరువైపులా గోడలు నిర్మించారు. రెండేళ్లుగా వాగులో ఉద్ధృతంగా వరద రావడంతో వంతెనకు ఓవైపు నిర్మించిన గోడలు కూలిపోవడంతో పాటు వాగు ఒడ్డునున్న భూమి పెద్దఎత్తున కోతకు గురైంది. గతేడాది ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినా విడుదల కాకపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం పూర్తయితే సంగెం, నాగులపేట, కథలాపూర్ మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ వాగుపై లోలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.2.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. అనంతరం అప్పటి ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాన చేశారు. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించలేదు. ప్రస్తుతం రూ.2.80 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వంతెన నిర్మాణం చేపడితే రామారావుపల్లె, కోరుట్ల పట్టణం, కోరుట్ల, కథలాపూర్, వేములవాడ ప్రాంతాలకు అక్కడి ప్రాంత ప్రజలు వెళ్లడానికి దూరాభారం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

కోరుట్ల నియోజకవర్గంలో వంతెనల నిర్మాణాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లో అయిదు వంతెలనకు సీఆర్‌ఆర్ గ్రాంట్ కింద రూ.14.30 కోట్ల నిధులను విడుదల చేసింది. వంతెన నిర్మాణాలు పూర్తయితే ఏళ్లతరబడి నెలకొన్న ఇబ్బందులు తొలగనున్నాయి.మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగస్టు 22, 2023న శంకుస్థాపన చేశారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మండలంలోని కోనరావుపేట, కథలాపూర్ మండలాలకు రాకపోకలకు మార్గం సుగమమవుతుంది.మల్లాపూర్ వడ్డెర కాలనీ వద్ద వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# అమృత్ నీరు అందేదెప్పుడు?



ధర్మపురి : జిల్లాలోని అయిదు పురపాలికల్లో తాగునీటి వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అమృత్ పథకం అమలుకు నోచుకోవడం లేదు. రెండు నెలల కిందటే టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించలేదు. గుత్తేదార్ల ఎంపిక ప్రక్రియ కూడా జరిగినా పనులను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపడుతున్న అమృత్ యోజన(అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకం కింద జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. ఏ ఏ పనులు చేపట్టాలో నిర్ణయించి.. టెండర్లు సైతం ఆహ్వానించారు. తాగునీటి పథకాల విస్తరణకు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించేందుకు స్థలాలను ఎంపిక చేశారు. కొన్ని చోట్ల ఆయా ఎమ్మెల్యేలతో శంకుస్థాపనలు చేయగా.. మరికొన్ని చోట్ల ప్రారంభదశలో ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైపులైన్ల నిర్మాణాలు, నల్లా కనెక్షన్లను వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తీరనున్నాయి.జిల్లాకు రూ.125 కోట్లు

జిల్లాకు అమృత్ 2.0 పథకం కింద తొలి విడత రూ.125.95 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మున్సిపాలిటీల వారిగా జనాభా ప్రతిపాదకన జగిత్యాలకు రూ.35, కోరుట్లకు రూ.37.75, మెట్‌పల్లికి రూ.17.60, రాయికల్‌కి రూ.13.80, ధర్మపురికి రూ.23.00 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవిష్యత్తు జనాభాను అంచనా వేసి.. పైపులైను విస్తరణ, నల్లాలు, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నారు. జనాభాకు అనుగుణంగా నిధులు విడుదల కావడంతో పట్టణవాసులకు రానున్న రోజుల్లో నీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. పనుల జాప్యంపై ధర్మపురి పుర కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. ధర్మపురిలో 23 కి.మీల పైపులైను, 2 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు, 1500 నల్లాలను ఏర్పాటు చేస్తామన్నారు. అమృత్ పథకం కింద ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని.. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

## తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఆర్టీసీ ఉద్యోగులు

శామీర్ పేట, (గరుడ వార్త) : తోటి ఉద్యోగికి కుటుంబానికి టి ఎస్ ఆర్ టి సి ఉద్యోగులు ఆర్థిక సహాయం శుక్రవారం అందించారు. గత నెల 24న హకీంపేట్ డిపోకు చెందిన ములుగు రవీందర్ కండక్టర్ బ్రెయిన్ స్ట్రోక్ తో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీందర్ కు ఇద్దరు ఆడపిల్లలు ఒక బాబు ఉన్నాడు. వారిది చిన్న వయస్సు కావడంతో వారి ఆర్థిక అవసరాల దృష్ట్యా డిపో ఉద్యోగులు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని



ఆ కుటుం బానికి రూ. 87,500 తోటి ఉద్యోగి భార్య పిల్లలకు హకీంపేటలోని తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సీనియర్ ఎడిసి బాలరాజు గౌడ్, గోపు శ్రీనివాస్, పవన్ కుమార్, రామ్ చందర్, సుజిత్ కుమార్, కన్యాకుమారి, వినోద, సులోచన, తులసి రామ్, కేపీ రావు, వినోద్, శ్రీనివాస్, జె ఎస్ రెడ్డి, కే స్ రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలి : డిఐ గంగాధర్

శామీర్ పేట, (గరుడ వార్త) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి తమ బాధ్యతగా స్వీకరించాలని శామీర్ పేట పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి మండలం జగ్గం గూడ పరిధిలోని నిక్మార్ కళాశాల వెనుక భాగంలో హైదరాబాద్ లోని యునైటెడ్ వే ఎన్జీవో, డిలైట్ కంపెనీ ఉద్యోగులు సంయుక్తంగా పదివేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ





అత్యధికంగా మొక్కలు నాటాలని తెలిపారు. నేడు నాటిన మొక్కలే వృక్షాలుగా ఎదిగి వాతావరణ కాలుష్యా సమతుల్యతకు దోహదపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ అత్యధికంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హారిక, యునైటెడ్ ఎన్జీవో సంఘం సభ్యులు, డిలైట్ కంపెనీ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు పండుగకు తరలివెళ్లిన రైతులు

శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట, పూర్వ ఉమ్మడి మండలం నుండి,చి పెద్ద ఎత్తున రైతులు రైతు పండుగకు తరలి వెళ్లారు. మహబూబ్ నగర్ జిల్లా లో తెలంగాణ ప్రభుత్వము ఆధ్వర్యంలో



నిర్వహిస్తున్న రైతు పండుగ వేడుకలకు ఉమ్మడి శామీర్ పేట మండలం నుంచి శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

## కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

కరీంనగర్ : ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.

రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలుచోట్ల సేవలు అందించారు. 2018– 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

# ఇక కోతుల బెడద ఉండదు!

పరిగి : ఒకప్పుడు జిల్లాలో అటవీ ప్రాంతాలకే పరిమితమయ్యే కోతులు నేడు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. కొన్నిచోట్ల పంటలపై దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు పలు ప్రాంతాల్లో ఆరుతడి పంటల సాగునే మానేయాల్సి వస్తోంది. ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఊరట కలిగించే విధంగా జిల్లా అటవీశాఖ తాజాగా ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. నిజానికి గతేడాది నుంచి ఇప్పటి వరకు 2.10లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటగా అందులో 40వేల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. అయితే ఈ ఏడాది నుంచి వీటి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**25శాతం పండ్ల మొక్కలు**

వనమహోత్సవం సందర్భంగా ఏటా ప్రభుత్వం మొక్కల పెంపకానికి ఇతోధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈక్రమంలోనే నాటే మొక్కల్లో కనీసం 25శాతానికి తగ్గకుండా పండ్ల మొక్కలు పెంచాలని భావించి సంరక్షణ పనులు చేపట్టారు. ఇవీ రకాలు: సీమచింత, సీతాఫలం, మర్రి, మేడి, జువ్వి, నక్కెర, మొర్లి, అల్లనేరెడు, చింత, అక్కడక్కడా మామిడి



మొక్కలను నాటారు.

**ఆ ప్రాంతాలు ఇవే..**

మొదటి దశలో కోతుల బెడద అధికంగా ఉన్న కొన్ని ప్రాంతాలను అటవీశాఖ గుర్తించింది. పరిగి, కొడంగల్, తాండూరు, ధారూర్ రేంజ్ పరిధిలోని మిట్టకోడూరు, కొడంగల్ పరిధిలోని గోకపస్లాబాద్, అనంతసాగర్, తిప్పాపూర్, రాస్నం, అంపల్లి, ఘట్‌కొండాపూర్, దుద్యాల, ధారూర్, గొట్లపల్లి, అంతారం గ్రామాలున్నాయి.

**ఏటా పెంచుతాం:**జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి

కోతుల బెడద నుంచి పంటలు రక్షించాలని రైతుల నుంచి వినతులు అందుతున్నాయి. ఇందులో భాగంగానే అటవీ ప్రాంతాల్లో నాటే మొక్కల్లో 25శాతం పండ్ల మొక్కలు నాటాలని నిశ్చయించి ఇప్పటివరకు 40వేల మొక్కలు నాటాం. ఇకపై ఏటా విస్తీర్ణం పెంచుతాం. నాటిన వాటి సంరక్షణ చర్యలు పక్కాగా చేపడుతున్నాం.

# రాణాల్లో మహిళా శక్తి

కరీంనగర్ : గతంలో పోలీస్ ఉద్యోగం అంటే కత్తి మీద సాములాంటిదని భావించేవారు. యువకులు పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే కుటుంబ సభ్యులు అడ్డు చెప్పేవారు. గత అయిదారు ఏళ్లుగా ఈ ఉద్యోగాలపై ఆసక్తి పెరిగింది. పురుషులతో సమానంగా మహిళలు సైతం త్రివిధ దళాలతోపాటు పోలీస్ ఉద్యోగానికి మొగ్గు చూపుతున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లాలో తాజాగా 117 మంది మహిళా



కానిస్టేబుళ్లు సివిల్, ఏఆర్ విభాగంలో నియామకమయ్యారు.

**ఇతర ఉద్యోగాలతో పోలిస్తే..**

ఇతర ఉద్యోగాలతో చూసుకుంటే కొన్ని సందర్భాల్లో అనూహ్య ఘటనల నేపథ్యంలో రోజుల తరబడి ఇతర ప్రాంతాల్లో బందోబస్తు కొనసాగించాల్సి ఉంటుంది. అంతేగాక పురుషులతో సమానంగా 9 నెలల కఠిన శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో ఫైరింగ్, ఇన్‌డోర్, అవుట్డోర్ అంశాలపై దృష్టి సారించడం ముఖ్యం. అయినా పట్టుదలతో కొందరు మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. బాధ్యతలు స్వీకరించాక కూడా రాణిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంపికైన వారిలో డిగ్రీ, పీజీ చదువుకున్న వారితోపాటు ప్రైవేటు ఉద్యోగినులూ ఉన్నారు.

**కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి- వి.మాధవి, ఏసీపీ, కరీంనగర్ కమిషనరేట్** తెలంగాణ ఏర్పడిన తరువాత మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తోంది. దానిని దృష్టిలో పెట్టుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. మహిళా పోలీసుగా రాణిస్తే వ్యక్తిగతంగానూ.. సమాజంలో అనేకమందికి రక్షణ కల్పించే అవకాశముంది. కుటుంబ సభ్యులు సైతం మహిళలను పోలీసు శాఖలోని అన్ని విభాగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలి. ఇతర శాఖలతో పోల్చితే పోలీసు ఉద్యోగం ఆత్మస్థైర్యం పెంచుతుంది.

## ఇరుకు వంతెనలు.. ప్రయాణానికి ఇబ్బందులు

మిర్యాలగూడ : నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎడమ కాలువ (లాల్ బహదూర్ కాలువ)పై 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, ఇరుకుగా మారి ప్రాణాంతకంగా తయారయ్యాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువను ఆధునికీకరించి కట్టలు మరమ్మతులు చేసిన సమయంలో వంతెనలు విస్తరించటం, నూతనంగా నిర్మించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సాగర్ ప్రాజెక్టు 1955లో నిర్మాణం ప్రారంభించి 1967 వరకు పూర్తి చేశారు. కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, పశ్చిమగోదావరి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సాగునీరు అందిస్తోంది. అదే సమయంలో కేవలం 3.5 మీటర్ల వెడల్పు మాత్రమే వంతెనలు నిర్మించారు. గతంలో ఎడ్లబండ్లు, ఇతర చిన్న తరహా వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉండగా.. కాలక్రమేణా వాహనాల రద్దీ పెరిగిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్ల వినియోగం ఎక్కువవగా.. ఇతర వరికోత యంత్రాలు సైతం వినియోగిస్తుండటంతో ఇరుకు వంతెనలపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పెద్దవూర- అల్వాల మార్గంలోని వంతెన, తెట్టెకుంట, ఇబ్రహీంపేట, వేంపాడు, బొక్కముంతలపాడు, ముకుందాపురం, కంపసాగర్, పెద్దదేవులపల్లి, ఐలాపురం, కుర్యాతండా, అన్నపురెడ్డిగూడెం, శెట్టిపాలెం, జగ్గుతండా, దొండవారిగూడెం, తడకమళ్ల, రావులపెంట వంతెనలతో పాటు నేరేడుచర్ల, గరిడేపల్లి, కోదాడ, హుజూర్‌నగర్, చిలుకూరు, నేలకొండపల్లి మండలంలోని వంతెనలు సైతం విస్తరించాలని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. హాలియాలో ఎన్నెస్పీ కాలువపై కోదాడ-జడ్చర్ల రహదారి విస్తరణ పనుల్లో ఇటీవల విస్తరిస్తున్నారు. అద్దంకి రహదారిపై వేములపల్లి మండల కేంద్రంలోని వంతెనను గతంలోనే రెండువైపులా విస్తరించారు. ఇది ప్రస్తుతం ఇరుకుగామారగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారులకు నివేదించాం: గోపీనాథ్, ఎడమకాలువ డీఈ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మించిన వంతెనలు ప్రస్తుతం వాహనాల రద్దీకి తగిన విధంగా లేవు. ఇప్పటికే మేము గుర్తించి ఉన్నతాధికారులకు విస్తరించాల్సిన అవసరం గురించి నివేదించాము. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా విస్తరణ పనులు చేపడతాము.

# అధికారులూ.. ఇంకెప్పుడు స్పందిస్తారు!



కరీంనగర్ : గంగాధర మండలం బూరుగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బడికి సరఫరా చేసిన కొత్త బియ్యంతో మధ్యాహ్న భోజనం చేసిన 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కుమురంభీం జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి శైలజ వసతిగృహంలో భోజనం చేసి అస్వస్థతకు గురై.. 21 రోజులు హైదరాబాద్ నిమ్స్ అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కరీంనగర్‌లోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో భోజనానికి కొత్త బియ్యంతో వండిన అన్నం ముద్దగా మారడం, ఉడకకపోవడం, అడుగంటడంతో విద్యార్థులు దాన్ని తినలేమని ఆందోళనకు దిగారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వారికి కొత్త అవస్థలను తీసుకొస్తోంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం నాసిరకంగా రావడంతో వాటితో వండిన భోజనం వారిని అస్వస్థతకు గురి చేస్తోందనే దానికి ఇటీవల జిల్లాలో జరుగుతున్న ఘటనలే నిదర్శనం.

**వారం రోజులుగా ఇదే దుస్థితి..**

కొత్త బియ్యంతో అన్నం ఉడకడంలేదు. పైభాగంలో ఉడకనట్లుగా, మధ్య భాగంలో ముద్దగా, అడుగు భాగాన మాడిపోతుంది. దాన్ని తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. వారం రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సమకూరుస్తున్న భోజనం ఈ దుస్థితిలో ఉన్నా దాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు మాత్రం పాలకులు, అధికారులు చేయడంలేదు. ఈ పరిస్థితుల్లో మెజారిటీ పాఠశాలల్లో కొత్తగా సరఫరా చేసిన బియ్యాన్ని పక్కన బెడుతున్నారు. ఇప్పటివరకు నిల్వఉన్న బియ్యంతోనే వండుతున్నారు. అవి అయిపోతే ఎలాగనే సంశయంలో వారున్నారు.

**మాటలతోనే సరి..**

విద్యార్థులు ఈ భోజనంతో అస్వస్థతకు గురైన ఘటనలపై అప్పటికప్పుడు స్పందిస్తున్న అధికారులు బియ్యాన్ని మార్చి వాటి స్థానంలో వేరే వాటిని పంపిస్తామని చెబుతున్నారు. వాస్తవ పరిస్థితిలో మాత్రం వారి మాటలు అమలు కావడంలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఇలానే చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఆ నిల్వలను వెనక్కి తీసుకులేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరముంది.

**ఈ బియ్యంతో వండి పెట్టలేం..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్తగా ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని వండిపెట్టలేమని భోజన వంట కార్మికులు చేతులెత్తేస్తున్నారు. మంగళవారం కరీంనగర్‌లోని పురాతన ప్రభుత్వ పాఠశాలలో విచారణకు వచ్చిన డీఈవో జనార్దన్‌రావును ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.బాబాయి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మంజుల, ఈ.స్వరూప, పలువురు కలిసి ఇదే విషయాన్ని చెప్పారు. ఉడికి ఉడకని, ముద్దగా మారుతున్న అన్నంతో తాము తప్పు చేసినట్లుగా ఇబ్బంది పడాల్సి వస్తోందని, నాణ్యమైన బియ్యంను సరఫరా చేయాలని కోరారు. వేరే బియ్యాన్ని అందించాలని సంబంధిత అధికారులను కోరామని డీఈవో జనార్దన్‌రావు వారికి చెప్పి పంపించారు.

# ప్రభుత్వ ప్లాంట్ వద్దు.. ప్రైవేటు ముద్దు



సిరిసిల్ల : కరోనా సమయంలో ఆక్సిజన్ లేక అనేక మంది ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఆక్సిజన్ కోసం ప్రజలు అల్లాడిన తీరు నేటికీ మన కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రాష్ట్రంలో పలు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ ప్లాంట్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. దానితో పాటుగా భారీ జనరేటర్‌ను ఏర్పాటు చేసి షెడ్ కట్టారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించినవి నిరుపయోగంగా మారాయి. కరోనాను దృష్టిలో పెట్టుకొని 2020లో భారత ప్రభుత్వం రాష్ట్రంలో పలు ఆసుపత్రులకు పీఎం కేర్ పథకం ద్వారా ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరు చేసింది. అందులో భాగంగా సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. కానీ కొద్ది రోజులు మాత్రమే వినియోగించారు.

2020లో భారత ప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో పలు ఆసుపత్రులకు శ్రీభారతి ఆక్సిజన్ డిస్ట్రిబ్యూటర్ ప్లాంట్‌ను మంజూరు చేసింది. ఇందులో భాగంగా సిరిసిల్లలో నిర్మించారు. దీని నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నేరుగా ప్రైవేటు సంస్థకు నిధులు చెల్లిస్తోంది. భారతి ఆక్సిజన్ ప్లాంట్ వచ్చిన తరవాత చిన్న చిన్న మరమ్మతుల కారణంగా పీఎం కేర్ పథకంలో నిర్మించిన ప్లాంట్‌ను మూలకు చేర్చారు.

విద్యుత్తు సరఫరా లేనప్పుడు రోగులు ఇబ్బందులు పడకుండా భారీ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది కూడా నిరుపయోగంగా మారింది. పీఎం కేర్ ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్‌కు కలిపి సుమారు రూ. 70 లక్షల నుంచి రూ.80 లక్షలు ఖర్చు చేశారు. ఇవి మూలకు చేరడంతో ఈ నిధులన్నీ వృథాగా అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆక్సిజన్ ప్లాంట్‌ను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

**మరమ్మతు చేయిస్తాం- లక్ష్మీనారాయణ, సిరిసిల్ల జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్** కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలో ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవలే జూమ్ మీటింగ్ జరిగింది. పాత ఆక్సిజన్ ప్లాంట్‌ను మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

# 'మాత'కు నాణ్యత లేని ఆహారం



కరీంనగర్ : కరీంనగర్ జనరల్ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అందించే ఆహారంలో నాణ్యత ఉండటంలేదు. ప్రభుత్వాసుపత్రుల్లో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం మెనూ రూపొందించగా.. ఇక్కడ మాత్రం అలాంటిది పాటించడం లేదు. ఆసుపత్రిలో చేరినవారికి ఉదయం, పగలు, రాత్రి ఎలాంటి ఆహారం అందించాలనే వివరాలు ప్రదర్శించాల్సి ఉండగా.. ఆసుపత్రిలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు ఆసుపత్రిలో గుత్తేదారు అందించే నాణ్యతలేని ఆహారాన్నే తీసుకుంటున్నారు. ఆసుపత్రిలో బాలింతలకు అందిస్తున్న ఆహారంపై పరిశీలన చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**మెనూ అమలేదీ?**

మాతా, శిశు ఆసుపత్రిలో అడ్మిట్ అయినవారికి ఆహారం కోసం ప్రతి ఒక్కరికి రూ.70 చెల్లిస్తోంది. ఇందులో వైద్య సిబ్బంది సూచించిన మేరకు ఆహారం అందించాలి. నిబంధన ప్రకారం మధ్యాహ్నం మెనూలో వండిన అన్నం 450 గ్రాములు, ఆకుకూర 100 గ్రాములు, కూరగాయల కూర 50 గ్రాములు, సాంబారు 25 గ్రాములు పప్పుతో ఉండాలి. ఉడకబెట్టిన కోడిగుడ్డు, అరటిపండుతోపాటు మజ్జిగ 200 మిల్లీలీటర్లు ఇవ్వాలి. కానీ నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారు.

**నీళ్ల సాంబారు.. పలుచగా మజ్జిగ**

పగలు రెండు కూరలతోపాటు సాంబార్, మజ్జిగ, అరటిపండు, కోడిగుడ్డు, బ్రెడ్ అందిస్తున్నారు. సాంబార్ నీళ్ల మాదిరిగా, మజ్జిగ పలుచగా ఉంటుండగా.. బ్రెడ్ గట్టిగా ఉంటుంది. ఒకటి ఆకుకూర, పప్పు ఉండాల్సి ఉండగా.. కేవలం పప్పు మాత్రమే వడ్డిస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి మిగతా విషయంలోనూ దృష్టి సారిస్తే మరింత బలవర్ధకమైన ఆహారం మహిళలకు అందనుంది.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం- డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్**

ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. గతంలో బ్రెడ్ విషయంలో గుత్తేదారుకు చెప్పాం. పూర్తి స్థాయిలో నాణ్యమైన ఆహారం అందించేలా చూస్తాం.

# గుట్టల చెంత అక్రమంగా తవ్వకాలు!

ధర్మపురి : పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రభుత్వం ఓవైపు పిలుపునిస్తుండగా మరోవైపు గుట్టల ప్రాంతంలో మట్టికోసం కొందరు అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. పర్యావరణానికి తూట్లు పొడుస్తూ ఏకంగా గుట్టలనే మాయం చేస్తున్నారు. వేల మొక్కలతో ప్రకృతి రమణీయతను పంచే గుట్టలు క్రమంగా మాయమైపోతున్నాయి. ధర్మపురి, బుగ్గారం మండలాల్లోని పలు గ్రామాల శివార్లలోని గుట్టల ప్రాంతంలో పలువురు గుత్తేదారులు, అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మట్టిని తోడేస్తున్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల, దొంతాపూర్, మగ్గిడి, జైన ఆరెపల్లి, బుగ్గారం మండలంలోని బుగ్గారం, గోపులాపూర్, మద్దునూర్ తదితర ప్రాంతాల్లో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే కొందరు రాత్రికి రాత్రే యంత్రాలను ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. నేరెళ్ల ప్రాంతంలో ఎర్రమట్టికి విపరీతంగా డిమాండ్ ఉంటోంది. మామూలు మట్టి ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.800 వరకు ధర పలికితే, ఎర్రమట్టి అంతకు రెట్టింపు ధర పలుకుతోంది. రాత్రి వేళల్లో రహస్యంగా ఈ ఎర్రమట్టిని గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. కొందరు దళారులు తాము చేస్తున్న పనుల కోసం మట్టి రకం గుట్టలను పరిశీలిస్తున్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని గుట్టల్లోని మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత దశాబ్దకాలంగా అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలతో గుట్టలన్నీ రూపు కోల్పోతున్నాయి.

# సేవల విస్తృతి.. సమగ్ర ప్రగతి

కరీంనగర్ : పల్లె ప్రగతికి సహకార రంగం చుక్కానిలా నిలుస్తోంది.. సమ్మిళిత అభివృద్ధిలో గణనీయ పాత్ర పోషిస్తోంది.. సాగు మొదలు విదేశీ విద్యా రుణాలు.. సాంకేతిక సేవలు, బంకుల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, కామన్ సర్వీసు కేంద్రాలు.. ఇలా భిన్నమైన రంగాల్లో ప్రగతి చాటుతూ ముందుకు సాగుతోంది. తాజాగా దిల్లీలో ఐసీఏ ప్రపంచ సహకార రంగాల సదస్సు కొనసాగుతుండటం.. అయిదు రోజులపాటు నిర్వహించే ఈ వేదికలో కరీంనగర్ డీసీసీబీ పురస్కారం అందుకున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సహకార రంగ ప్రగతిపై కథనం. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్యాక్స్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం నీళ్ల సీసాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముడిసరుకుతో సీసాలను తయారు చేసి 'సహకార' అనే పేరున నీళ్ల సీసాలు తయారు చేసి పెళ్లిళ్లు, శుభకార్యాలు, బస్టాండ్, పలు వ్యాపార సముదాయాలకు సరఫరా చేస్తున్నారు. పది మందికి ఉపాధి, నెలకు రూ.60 వేల ఆదాయం సమకూరుతుంది. ఇదే సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయగా 8 మంది ఉపాధి పొందుతున్నారు. నెలకు సుమారు రూ.40 వేల ఆదాయం సంఘానికి సమకూరుతుంది.

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. ఈ బంకు ద్వారా రోజుకు రూ.3 వేల ఆదాయం సమకూరుతోంది. అలాగే సంఘం ద్వారా నాబార్డు సహకారంతో రూ.2.26 కోట్లతో రైసుమిల్లు నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సంఘం ద్వారా ఏటా రూ.10కోట్ల లావాదేవీలు కొనసాగుతుండగా, ఇందులో రూ.20 లక్షల వరకు సంఘానికి ఆదాయం వస్తుంది. దేశంలోనే కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) ఉత్తమ స్థానంలో నిలిచింది. అత్యుత్తమ సేవలతో జాతీయ స్థాయిలో ఉన్న 352 డీసీసీబీలతో పోటీ పడి ఈ ఘనతను సాధించింది. గతంలోనూ వరుసగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇక్కడి బ్యాంకు అందించిన సేవలకు అవార్డులు, ప్రశంసలు అందాయి. మంగళవారం 108 దేశాల సభ్యత్వం కలిగిన ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ అలయన్స్ ఆధ్వర్యంలోని జాతీయ సదస్సులో కేంద్రమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఉత్తమ జిల్లా బ్యాంకు అవార్డును ఛైర్మన్ రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావులు అందుకున్నారు. 2005-06లో అప్పుల ఊబిలో ఉన్న బ్యాంకు నేడు రూ.7500 కోట్ల లావాదేవీలతో పటిష్ఠమైన వ్యవస్థగా ఏర్పాటైంది. ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతోపాటు రైతులకు, ప్రజలకు ఏది అవసరమో దాన్ని అందజేస్తూ సంస్కరణలకు పెద్దపీట వేసే డీసీసీబీగా గుర్తింపు పొందింది.

**కామన్ సర్వీస్ కేంద్రం..**

చిత్రంలో కనిపిస్తున్నవారు చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన సరళ. కామన్ సర్వీస్ కేంద్రం ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించారు. ఈకేవైసీ, పాన్‌కార్డులు, ఇతర అంతర్జాల సేవలను గ్రామీణులకు అందిస్తూ నెలకు రూ.18-25 వేల వరకు సంపాదిస్తున్నారు.

**ఇదీ ఘనత** 2017నాటికే ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణను పూర్తి చేసుకుని దాదాపుగా 3.97లక్షల మంది రైతులకు పలురకాల సేవల్ని అందిస్తున్నాయి. రుణాల అందజేతతోపాటు వారి పిల్లల విద్యావసరాలకు, విదేశీ విద్యకు ఆర్థికసాయమందిస్తున్నాయి. 80శాతం సంఘాలు వందశాతం రుణాల రికవరీతో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి పీఏసీఎస్ పరిధిలో ఎరువుల విక్రయాలు సాగుతున్నాయి. ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు 50కిపైగా ఏర్పాటయ్యాయి. నానో యూరియా, ఎరువుల వాడకంలో ప్రయోగాలు జరిగాయి. 12 ఏటీఎంలు, 193 మైక్రో ఏటీఎంలు, 245 పీవోఎస్ యంత్రాలతో సేవలందిస్తున్నాయి.

54 సంఘాలు పెట్రోలు, డీజిల్ బంకులను ఏర్పాటు చేశాయి. ఇందులో కొన్ని మూతపడగా ఇంకొన్ని ఇటీవల తెరుచుకున్నాయి. విత్తనశుద్ధి కేంద్రాలు, ఆర్వో ప్లాంటలు ఏర్పాటయ్యాయి. 42 గ్రామాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్‌లను విస్తరించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1652 మంది అతివలు కామన్ సర్వీస్ కేంద్రాలు (సీఎస్‌సీ)లు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో కొన్ని బాగా నడుస్తుండగా ఇంకొన్ని అరకొర సేవలకు పరిమితమవుతున్నాయి.

**తోడ్పాటు అందితే మరింత అభివృద్ధి- మనోజ్‌కుమార్, డీసీవో, జగిత్యాల**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత తోడ్పాటును అందిస్తే సహకార రంగం మరింత అభివృద్ధి చెందే వీలుంటుంది. ప్యాక్స్‌ల ద్వారా సాగుకు యంత్రసాయం పెరిగితే రైతులకు సేవలు మెరుగవుతాయి. సహకార సంఘాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

# బీమా.. ఇంటికి ధీమా

ఆలేరు : స్వయం సహాయక సంఘాల సభ్యులు సంఘంలో కొనసాగుతూ ఏమైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించింది. బ్యాంకులతో పాటు స్త్రీనిధి రుణాలు తీసుకున్న సభ్యులు అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తు మృతి చెందినప్పుడు వారికి సంబంధించిన వాటాధనం చెల్లించడం సమస్యగా మారుతుంది. బృందంగా రుణం తీసుకుంటే మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాధిత కుటుంబీకులు వాయిదాలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. ఇది సంఘంలోని ఇతర సభ్యులపై ప్రభావం చూపుతోంది. ఈ సమస్య నుంచి బయట పడేందుకు ప్రభుత్వం 'మహిళాశక్తి' పేరిట ప్రమాద బీమా అమల్లోకి తీసుకొచ్చింది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 75,678 స్వయం సహాయక సంఘాలకు గానూ 8,21,717 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు.

**క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ..**

ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న ఈ పథకం అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఆయా సంఘాల సభ్యులు ఎంతమంది, ఏ రకంగా చనిపోయారు, వారు తీసుకున్న రుణం, తదితర వివరాలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ ప్రక్రియ అంతా ముగిశాక వచ్చే నెలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బాధిత కుటుంబాలకు చెక్కులు అందించనున్నట్లుగా తెలుస్తోంది. గ్రామీణ, పురపాలిక పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్న 18 నుంచి 60 ఏళ్లలోపు వారు ఈ పథకానికి అర్హులు. సదరు సభ్యురాలు మృతి చెందితే ఆ సమాచారం గ్రామం, పురపాలిక సిబ్బందికి తెలియజేయాలి. ఆయా వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు. అవి స్త్రీనిధి సహాయ మేనేజరు, అక్కడి జనరల్ మేనేజర్‌కు వెళ్తాయి. మరణ ధ్రువీకరణ పత్రం, ఇతర వాటిని పరిశీలించి అన్ని సరిగ్గా ఉంటే బీమా పరిహారం మంజూరు చేస్తారు.

**రుణమాఫీతో పాటు.. ప్రమాదబీమా..** సభ్యురాలు సాధారణంగా మరణిస్తే తీసుకున్న రుణం రూ.2 లక్షల వరకు మాఫీ అవుతుంది. స్త్రీనిధి బ్యాంకు రుణానికి వర్తింపజేస్తారు. మిగతా సభ్యులు తమ వాయిదాలను చెల్లిస్తే సరిపోతుంది. ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాదబీమా కింద రూ.10 లక్షలు బాధిత కుటుంబానికి చెల్లిస్తారు. అప్పు సైతం మాఫీ అవుతుంది. గాయపడితే సదరం ధ్రువపత్రం ఆధారంగా బీమా ఇస్తారు.

# హౌసింగ్ బోర్డు ఇళ్లకు మోక్షం

హైదరాబాద్: గృహ నిర్మాణ సంస్థ(హౌసింగ్ బోర్డు) ఇళ్లకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. రెండు దశాబ్దాలుగా ఆ ఇళ్ల రిజిస్ట్రేషన్ వ్యవహారం పెండింగ్‌లో ఉంది. రుణాలు చెల్లించిన లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి వాటిని రిజిస్టర్ చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ నిర్ణయించింది. 1986 ప్రాంతంలో ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ కేటగిరీల్లో వివిధ విస్తీర్ణంతో కూడిన ఇళ్లను ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించింది. వేలాది ఇళ్లు ఇంత వరకు రిజిస్ట్రేషన్లు కాలేదని అధికారులు తాజాగా గుర్తించారు. రిజిస్ట్రేషన్ కావాల్సిన వాటిల్లో అధిక శాతం గ్రేటర్ పరిధిలో ఉన్నట్లు నిర్ధారించారు. హౌసింగ్ బోర్డు వ్యవహారాలపై కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. లబ్ధిదారులకు రిజిస్టర్ చేయాల్సిందిగా గతేడాది హైకోర్టు



సైతం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అలాంటివి ఎన్ని ఉన్నాయన్న అంశంపై అధికారులు అధ్యయనం చేశారు.

**5 వేల ఇళ్లు:** రిజిస్ట్రేషన్లు చేయాల్సిన ఇళ్లు సుమారు 5వేల వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎల్ఐజీ, ఎంఐజీ విభాగాల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారులు ఆ రుణ వాయిదాలు(కిస్తీలు) సైతం కొన్నేళ్ల కిందటే చెల్లించినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. వాటిని వారు అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా స్పష్టం చేయడంతో లబ్ధిదారులకు నోటీసుల జారీ ప్రక్రియను అధికారులు చేపట్టారు.

**అసలు లబ్ధిదారులు ఎక్కడ..**

నోటీసులు జారీ చేసే క్రమంలో అధిక శాతం ఇళ్లను పొందిన అసలు లబ్ధిదారులను గుర్తించడం అధికారులకు సమస్యగా మారింది. కొందరు అనధికారికంగా ఇతరులకు విక్రయించారు. ప్రస్తుతం ఆ ఇళ్లలో ఉన్న వారికి నోటీసులు అందిస్తుండడంతో అసలు లబ్ధిదారులు ముందు కొస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

# హద్దు దాటితే.. ఆపరేషన్ రోప్!

హైదరాబాద్ : నగరంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి కూడా తనకు గ్రీన్‌ఛానల్ అవసరం లేదని చెప్పారని కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సీఎం గ్రీన్‌ఛానల్ ఇవ్వమన్నారని వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యను గాడిన పెట్టాలనే సంకల్పంతో ఆగిపోయిన ఆపరేషన్ రోప్(రోడ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ ఎన్‌క్రోచ్‌మెంట్) కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. వాహనదారుల ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, ఏసీపీ ధనలక్ష్మి సారథ్యంలో షేక్‌పేట నుంచి టోలిచౌకి ఫ్లైఓవర్ వరకు ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించారు. 15 రోజుల ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న 1500 సైరన్లను బుల్డోజర్‌తో ధ్వంసం చేశారు. అనంతరం టోలిచౌకిలో మీడియాతో మాట్లాడారు. సర్పంచుల నుంచి మాజీ ఎమ్మెల్యేల వరకు వాహనాలకు సైరన్లు బిగించుకొని ఇష్టానుసా



రం మోగిస్తున్నారని ఆయన వివరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎరుపు, నీలం రంగు బల్బులు, సైరన్లు వినియోగించటం నేరమని స్పష్టంచేశారు.

**అడ్డుకుంటారు.. సమస్య అంటారు..**

ఆపరేషన్ రోప్‌లో భాగంగా చేపట్టిన ఆక్రమణల తొలగింపునకు స్థానిక ఎమ్మెల్యే కౌసర్‌ను రావాల్సింది కోరానని, ఆయన రాలేదని సీపీ వెల్లడించారు. ట్రాఫిక్ జాంలకు కారణమవుతున్న వాటిని తొలగిస్తే పేదలు ఎలా బతకాలంటూ తొలగింపును అడ్డుకుంటారని, మళ్లీ వారే నగర ట్రాఫిక్‌ను సరిదిద్దమని కోరుతుంటారని గుర్తుచేశారు. కొన్ని దుకాణాల యజమానులు ఫుట్‌పాత్‌ల స్థలాన్ని చిరువ్యాపారులు, తోపుడుబండ్లకు అద్దెకిస్తూ మాఫియాగా తయారయ్యారన్నారు.

# విలువైన స్థలాలున్నా.. ఆదాయం సున్నా!

హైదరాబాద్: నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు సందర్శించే ప్రాంతాల్లో స్థలాలు ఉంటే, ఎవరైనా వాటిని సద్వినియోగం చేసుకొని ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కీలకమైన ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు వృథాగా ఉంటూ ప్రైవేటు కార్యకలాపాలకు అడ్డాగా మారినా, పట్టించుకోవడం లేదు. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ ఎదురుగా విలువైన ఖాళీ స్థలం ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. గతంలో ఈ స్థలాన్ని




ఐమాక్స్‌కు వచ్చే వాహనదారులకు పార్కింగ్‌గా వినియోగించేవారు. ఇందుకు హెచ్‌ఎండీఏకు ఏటా రూ.కోట్లలోనే ఆదాయం వచ్చేది. గతేడాది ఈ ప్రాంతంలో ఫార్ములా ఈ-రేస్ నిర్వహించడంతో పార్కింగ్ ఆపేశారు. ఈవెంట్ ముగిసిన తర్వాత నుంచి స్థలం ఖాళీగా ఉంటుండటంతో ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలు నిలుపుతున్నారు.

పీపుల్స్ ప్లాజా ఎదురుగా.. పీపుల్స్ ప్లాజా ఎదురుగా హెచ్‌ఎండీఏకు అంతే విలువైన ఖాళీ స్థలం ఉంది. ఇది కూడా కొంతకాలంగా ఖాళీగా ఉంటోంది. ప్రస్తుతం ఇక్కడ మరమ్మతులకు గురైన, డొక్కు వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ రెండు స్థలాలను దుకాణాలు లేదా మల్టీ లెవల్ పార్కింగ్ కింద మార్చినా హెచ్‌ఎండీఏకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరే అవకాశముంది.

# మెట్రో పనులన్నీ.. ఒకేసారి మొదలుపెడతాం



హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశకు కేంద్రం నుంచి అనుమతులు రాగానే అన్ని కారిడార్లలో ఏకకాలంలో పనులు మొదలు పెడతామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. కేంద్రం నుంచి రెండు నెలల్లో అనుమతి వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. పాతబస్తీ మెట్రోకి సంబంధించి కేంద్రం అనుమతుల వచ్చేదాకా ఎదురుచూడకుండా జనవరిలో పనులు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. రెండోదశలో రాష్ట్రం వాటా రూ.7313 కోట్లని.. ఏటా రూ.1500 నుంచి రూ.2వేల కోట్లు మెట్రోకి కేటాయింపునకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రాజెక్ట్‌ను నాలుగేళ్లలో పూర్తిచేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రెండోదశ పూర్తైతే 8 నుంచి 10 లక్షల మంది రాకపోకలు సాగిస్తారని చెప్పారు. ఈ నెల 28వ తేదీకి హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్ ప్రారంభమై ఏడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఎన్వీఎస్‌రెడ్డి బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడేళ్లలో 63 కోట్ల 40 లక్షల మంది మెట్రోలో రాకపోకలు సాగించారని తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 4 అదనపు కోచ్‌లను నాగ్‌పూర్, పుణె మెట్రో నుంచి లీజు తీసుకోవాలని ఎల్ అండ్ టీ మెట్రోకి చెప్పినట్లు తెలిపారు.

**మేడ్చల్ కారిడార్‌పై అధ్యయనం..**

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నిబంధనల్లో 90 శాతం రైట్ ఆఫ్ వే ఉంటేనే అనుమతి ఇస్తోందని.. ఈ కారణంగా ప్యారడైజ్-కండ్లకోయ/మేడ్చల్, జేబీఎస్-తూంకుంట, శామీర్‌పేట కారిడార్లను మెట్రోరెండోదశ తొలి భాగంలో చేర్చలేదని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. రైట్ ఆఫ్ వేకి రక్షణ శాఖ భూములు పెద్ద సమస్యగా ఉందన్నారు. ఈ ప్రాంతవాసుల నుంచి మెట్రో కావాలనే డిమాండ్ నేపథ్యంలో రెండోదశలో చేర్చేందుకు అధ్యయనం చేయాలని సీఎం తమకు ఆదేశించారని గుర్తు చేశారు.

**ఆస్తుల సేకరణకు:** పాతబస్తీలో ఆస్తుల సేకరణకు రూ.700కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. రెండోదశలో యూ గడ్డర్ సింగిల్ స్పాన్ విధానంలో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రెండోదశలో సగటున కి.మీ. మెట్రో నిర్మాణానికి రూ.318 కోట్లు అవుతుందని అన్నారు మెట్రోరైలు రెండోదశలో సగటున 35 కి.మీ. వేగం ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. స్టేషన్ల స్థలాలు, పేర్ల పరంగా ప్రజలు సూచనలు చేయవచ్చన్నారు. విమానాశ్రయ మెట్రోలో 1.6 కి.మీ.లు భూగర్భ మార్గం ఉంటుందన్నారు. మియాపూర్ గంగారం వద్ద 1.6 కి.మీ. డబుల్ డెక్‌లో కింద ఫ్లైఓవర్, పైన మెట్రో నిర్మించేలా కసరత్తు జరుగుతోందన్నారు. ఇప్పుడున్న కారిడార్లకు అటుఇటుగా రెండోదశలో విస్తరణ ప్రతిపాదించామని.. పనులు పూర్తయ్యాక పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్ వరకు ఒకటే మెట్రో నడిపేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు.

# విషంతో విలవిల.. పునరుజ్జీవం ఎలా?




హైదరాబాద్ : అత్యంత ప్రమాదకరమైన రసాయనాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి అర్ధరాత్రి మూసీలో కలుపుతున్న వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ట్యాంకర్లలోని కెమికల్స్‌ను మూసీలో కలుపడానికి గట్టు నుంచి నది లోపలికి ఏకంగా అర కిలోమీటరు మేర భూగర్భ పైపులైను నిర్మించడం చూసి స్థానికులు విస్తుపోయారు. ఏళ్లుగా సాగుతున్న ఈ దందాతో త్రివేణి సంగమంగా పేరొందిన బాపూఘాట్ నుంచి దిగువకు రసాయనాలు పేరుకుపోతున్నాయి. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీ) అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

1. రసాయనాల ట్యాంకర్
2. ఈ భూగర్భ పైపులైన్ ద్వారానే కెమికల్స్‌ను నదిలోకి వదులుతారు
3. రసాయనాలు కలిసే మూసీలోని ప్రాంతం

**కన్నెత్తి చూడని అధికారులు..**

మూసీ నదిని పునరుజ్జీవం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపెట్టారు. అందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే కొన్నాళ్లుగా ఎంఆర్‌డీసీ అధికారులు మూసీ ఆక్రమణల గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో రసాయనాల డంపింగ్‌కు మూసీని కేంద్రంగా చేసుకున్నారు. బాపూఘాట్ వంతెన పక్కన ఇసుక ఇతర వ్యాపారాలు చేస్తుంటారు. ఈ స్థలం నుంచి మూసీలోకి అర కిలోమీటరు మేర భూగర్భ పైపులైను వేశారు. మంగళవారం తెల్లవారుజామున ట్యాంకర్ వచ్చి భూగర్భ లైను ద్వారా రసాయనాలను నదిలోకి వదులుతుండటంతో స్థానికులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాశమైలారంలోని బల్క్ డ్రంగ్ ఫ్యాక్టరీ నుంచి 15 వేల లీటర్ల వ్యర్థాలను మూసీలోకి డంప్ చేసినట్లు తెలుస్తోంది.

**పీసీబీ గస్తీ బృందం వైఫల్యం..**

మూసీ ప్రవాహం ఉండే గండిపేట్ వద్ద నీటి నాణ్యత సాధారణంగా ఉండగా నగరంలో ప్రవేశించగానే కలుషితాల స్థాయి విపరీతంగా పెరుగుతోంది. బల్క్‌డ్రగ్, ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమల రసాయనాలను మూసీలో పారబోస్తుండటమే ఇందుకు కారణం. మూసీ ఒడ్డున కందకాలు తవ్వి, పైప్‌లైన్ ద్వారా వ్యర్థాలు తరలిస్తున్నారంటే పీసీబీ నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

**భవన వ్యర్థాలతో నింపేస్తున్నారు..**

అత్తాపూర్ నుంచి బాపూఘాట్ రోడ్డులో మూసీని ఆక్రమించి వాహనాల రిపైర్ కేంద్రంగా మార్చేశారు. ఆ పక్కనే మూసీ ఒడ్డున భవన నిర్మాణ వ్యర్థాలతో నింపేస్తున్నారు. మరికొందరు కోళ్లు, ఇతర జంతువుల కళేబరాలను పడేస్తున్నారు. అయినా బల్దియా, మూసీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నిర్దేశిత పరిమితులివే..**

నీటిలో కరిగే ఆక్సిజన్ (డీవో) పడిపోయి, బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) స్థాయులు అమాంతం పెరిగిపోతున్నాయి. సీపీసీబీ మార్గదర్శకాల ప్రకారం లీటరు నీటిలో కరిగిన డీవో మోతాదు 6 ఎంజీలు, బీవోడీ లీటరు నీటికి 2 ఎంజీలు అంత కంటే తక్కువగా ఉండాలి. కానీ మూసీ నీటి నాణ్యత ఫలితాలు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి.

# లంచం కొట్టు.. తొలి జీతం పట్టు

హైదరాబాద్: హైదరాబాద్ జిల్లాలో కొత్తగా ఉపాధ్యాయ కొలువులోకి చేరిన వారికి తొలిజీతం అందాలంటే రూ.2వేలు లంచం కొట్టాల్సిందే. వారి వేతనాలు బిల్లులను తయారు చేయడం, పేఅండ్ అకౌంట్స్ విభాగంలో అనుమతి పేరుతో ఆమోదముద్ర వేయించేందుకు విద్యాశాఖలోని కొందరు కిందిస్థాయి సిబ్బంది కొత్త టీచర్ల నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారు. నగదు ఇచ్చేందుకు అనుమానం అనుకుంటే... గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా బదిలీ చేయాలంటూ దర్జాగా చెబుతున్నారు. పాఠ్యపుస్తకాల్లో నీతి పాఠాలను పిల్లలకు బోధిస్తున్న తాము తొలి అడుగులోనే లంచం ఇవ్వాలా.. అని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదు పెద్దమొత్తం కాకపోయినా... తొలి జీతం మేమే ఇప్పిస్తున్నామంటూ కిందిస్థాయి సిబ్బంది డిమాండ్ చేయడం ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. మండలాల వారీగా విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారుల్లో కొందరు పరోక్షంగా ఈ బలవంతపు వసూళ్లు ప్రోత్సహిస్తున్నందుకే కొత్త టీచర్లు మౌనం పాటిస్తున్నారు.

**పాఠశాలల వారీగా..**

నగరంలో 680మంది ఉపాధ్యాయులు కొత్తగా విధుల్లో చేరారు. నవంబరు నెలంతా పనిచేస్తే.. వారికి డిసెంబరు మొదటివారంలో జీతం వస్తుంది. వారంతా ఎక్కడెక్కడ పనిచేస్తున్నారనే సమాచారాన్ని జిల్లా విద్యాశాఖ కిందిస్థాయి సిబ్బంది సేకరించారు. పాఠశాలల వారీగా వారిని గుర్తించి తొలిజీతం అందుకోవాలంటే లంచం ఇవ్వాలని నవంబరు రెండోవారంలో వారికి చెప్పారు. ఈ నెల 24లోపు అందరి వద్దా వసూలు చేసే బాధ్యతను ఇద్దరు వ్యక్తులకు అప్పగించారు. వీరిద్దరూ ఒక్కో టీచర్ నుంచి వసూలు చేశారు. అన్ని మండలాల్లో ఈ వసూళ్లు జరుగుతున్నా మా వద్ద ఎవరూ డబ్బు వసూలు చేయడం లేదని అధికారులు బుకాయిస్తున్నారు. సికింద్రాబాద్ పరిధిలోని ఓ మండల విద్యాధికారిని ఈ విషయమై ప్రశ్నించగా... తాము డబ్బు వసూలు చేయడం లేదని పే అండ్ అకౌంట్స్ వారు డబ్బులు



అడుగుతున్నారని, మాపై కాకుండా వారి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలంటూ చెప్పారు.

**జీతాల బిల్లు అంటేనే వసూళ్లు**

హైదరాబాద్ సహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్ల జీతాల బిల్లులకు ఆమోద ముద్ర వేయించేందుకు ప్రతి మండలంలో టీచర్ల నుంచి రూ.500ల నుంచి రూ.వెయ్యి వరకూ వసూలు చేస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తనకు రావాల్సిన జీతం బిల్లును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయుడు లేదా మండల విద్యాధికారికి ఓటీపీ వస్తుంది. ఉపాధ్యాయుడు జీతం బిల్లును సక్రమంగా నమోదు చేశారా.. లేదా అని పరిశీలించాక ఓటీపీ నమోదు చేస్తే.. బిల్లు పాసవుతుంది. అందుకు విరుద్ధంగా ఓటీపీలను కొందరు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ఇతరులకు ఇచ్చి బిల్లులు ఓకే చేయిస్తున్నారు. ఓటీపీలు వారికే ఇస్తున్నారు. పేఅండ్ అకౌంట్ వారికి ఇస్తున్నామంటూ వసూలు చేస్తున్న సొమ్ము ప్రైవేటు వ్యక్తులు తీసుకుంటున్నారా.. వారికే ఇస్తున్నారా అని ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బహిర్గతమవుతాయి.

# కూలీలు దొరకరు.. అడిగినంత ఇవ్వలేరు

వికారాబాద్ : జిల్లాలో రైతుకు ఎప్పుడూ విపత్కర పరిస్థితులే ఎదురవుతున్నాయి. విత్తు నాటడం నుంచి ఒడిదుడుకులు దాటుకొని పంట చేతికి వచ్చాక తీరా కూలీల కొరత. ఒకేసారి రైతులందరి పంటలు చేతికి రావడంతో కూలీలు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో రైతుల మధ్యన పోటీ ఏర్పడి కూలీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది పత్తి తీయడంలోనూ కూలీల కొరతతో రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఆటో కిరాయి రూ2,000 నుంచి రూ.3,000: రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన కుంచారం, షాదీపూర్, పోచారం, అడికి, తదితర గ్రామాల నుంచి కూలీలు రోజూ వస్తున్నారు. ఇందుకు ఆటో కిరాయి కింద రైతులు రూ.2 వేల నుంచి రూ.3 వేల చొప్పున చెల్లించాల్సి వస్తోంది. సగటున ఎకరాకు 6 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,520 కొంత మందికే లభిస్తోంది. తేమ శాతం వల్ల మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలు పత్తి



రూ.6,500 అమ్ముడు పోతోంది. ఎకరాకు రైతు చేతికి రూ.39 వేలు వస్తున్నాయి. ఖర్చులు అన్నీ కలిపితే ఎకరాకు సుమారు రూ.40 వేలు అవుతోంది. పత్తి అమ్ముకుంటే రైతు చేతికి అందేది రూ.39 వేలు. ఏడాది కష్టానికి రూ.1,000 లాభం. ఇదీ ప్రస్తుతం పత్తి పంట సాగు చేసిన రైతుల పరిస్థితి.

**ఎక్కడ చూసినా పంటే..**

పత్తికి ధర పెరగడం, పప్పుధాన్యాల ధర తగ్గడంతో వద్దన్నా పత్తి సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా పత్తి విస్తీర్ణం ఏయేటికాయేడు పెరుగుతోంది. దీంతో పత్తి తీతకు విపరీతమైన కూలీల అవసరం ఏర్పడింది. దీంతో ఇతర గ్రామాల నుంచి ప్రత్యేకంగా కూలీలను తీసుకువస్తున్నారు. ప్రతికూల పరిస్థితులతో పత్తి మొక్కకు 10 నుంచి 20 కాయలు మాత్రమే కాశాయి. ఈ పరిస్థితుల్లో ఓ కూలీ పొలంలో రోజంతా కష్టపడితే 25-30 కిలోల వరకు మాత్రమే పత్తితీత సాధ్యమవుతుంది.

**కిలోకు రూ.15 ఇచ్చి తీయించా..**

రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కూలీల కొరతతో కిలోకు రూ.15 ఇచ్చి ఇప్పటి వరకు మొదటి తెంపే తీయించా. రెండో తెంపుదలకు కిలోకు రూ.18 ఇస్తామన్నా కూలీలు దొరకడం లేదు.నర్సింలు, అల్లీపూర్, ధారూర్.

**సాగు తీరు ఇలా..** 2023.. 2.13 లక్షల ఎకరాలు 2024.. 2.51 లక్షల ఎకరాలు గతేడది కూలీ చెల్లింపు.. కిలోకు రూ.12 నుంచి రూ.20 ఈ ఏడాది.. ఆదినుంచే రూ.15

# నదుల్లో ఇసుకాసురులు.. సడిలేని అధికారులు

తాండూరు : ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ఎక్కడా కనిపించక పోవడంతో ఇసుకాసురులు చెలరేగి పోతున్నారు. జిల్లాలోని ప్రధాన నదులైన కాగ్నా, కాకరవేణి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గడచిన వర్షాకాలంలో భారీ వరదలతో ఇసుక మేటలు వేసింది. ప్రస్తుతం నదీ గర్భాల్లో ఎక్కువ శాతం నేల పొడిగా మారింది. ట్రాక్టర్లు, యంత్రాలు సులువుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీన్ని అనుకూలంగా మార్చుకున్న అక్రమార్కులు ట్రాక్టర్లు, కూలీలతో అదను చూసి నదుల్లోకి వెళుతున్నారు. ఇసుకను చకచకా ట్రాక్టర్లలోకి నింపి నిర్ణీత గమ్యస్థానాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇక రాజకీయ పలుకు బడి కలిగిన అక్రమార్కులు రాత్రుళ్లలో యంత్రాలతో తోడిన ఇసుకను లారీల్లో నింపి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలించి ఆర్థిక లబ్ధి పొందుతున్నారు. రోజుకు రూ.25,000 నుంచి రూ.30,000 ఆర్జన: ఒక్కో ట్రాక్టరు ఇసుకను నాణ్యతను బట్టి రూ.వేలల్లో గృహ నిర్మాణ దారులకు విక్రయిస్తున్నారు. ఒక్కో అక్రమార్కుడు ప్రతి రోజు 5 ట్రిప్పుల నుంచి 6 ట్రిప్పుల ఇసుకను విక్రయిస్తున్నారు. ట్రిప్పుకు రూ.5,000 నుంచి రూ.6,000 వసూలు చేస్తున్నారు. ఈలెక్కన రూ.25 వేల నుంచి రూ.30 వేల చొప్పున ఆర్జిస్తున్నారు.దీనివల్ల ప్రభుత్వానికి పన్నుల రూపేణా రూపాయి కూడా రావడంలేదు.



**రహస్య ప్రదేశాల్లో కుప్పలు**

ఆర్డర్లు లేకపోతే నదుల్లోని ఇసుకను నిర్ణీత రహస్య ప్రదేశాలకు తరలించి కుప్పలుగా పోస్తున్నారు. ఒక్కో కుప్పలో కనీసం 10 నుంచి 20 ట్రాక్టర్ల ఇసుక ఉంటుంది. కాగ్నా, కాకరవేణి నదుల పరివాహకంగా ఉండే బెన్నూరు, అగ్గనూరు, కోకట్, దేవనూరు, మన్‌సాన్‌పల్లి, ఖాంజాపూరు, వీర్‌శెట్టిపల్లి, నాగసమందర్, సంగెంకుర్దు, రాశులపూర్, గోవిందరావు పేట, క్యాద్గిర, గంగ్వార్ తదితర గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

**జాడలేని టాస్క్‌ఫోర్స్ పోలీసులు**

గతంలో ఇసుక రవాణాను నిరోధించడానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 24 గంటల పాటూ పనిచేశారు. ట్రాక్టర్లు, లారీలను జప్తు చేశారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం వీరి కార్యకలాపాలు ఎక్కడా కనిపించడంలేదు. ట్రాక్టరు ఇసుకను ప్రభుత్వం రూ.600ల చొప్పున విక్రయించేందుకు గతంలోనే నిర్ణయించింది. అయితే ట్రాక్టరు, కూలీలను మాత్రం కొనుగోలుదారు సమకూర్చు కోవాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

**ఇవీ లెక్కలు** కాగ్నా, కాకర వేణి నదుల్లో పేరుకున్న ఇసుక: లక్షల క్యూబిక్ మీటర్లు అక్రమార్కులు నిర్ణయించిన ట్రాక్టరు ఇసుక ధర: రూ.5,000 నుంచి రూ.6,000 నిత్యం కొల్లగొడుతున్న ఇసుక: 200 ట్రిప్పులు (ట్రాక్టర్లలో) ఒక్కో లారీలో తరలించే ఇసుక అమ్మకం ధర : రూ.25వేల నుంచి రూ.30వేలు.

# ప్రాణం.. గాల్లో దీపం!

పరిగి: బీజాపూర్– హైదరాబాద్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తెలంగాణ– కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, పరిగి, పూడూరు మీదుగా వెళుతోంది. హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని గుల్బర్గా, బీజాపూర్‌తోపాటు వికారాబాద్ జిల్లాకు వెళ్లేందుకు ఈ మార్గమే కీలకం. అనంతగిరి, కోట్‌పల్లి ఈ దారిలోనే ఉండటంతో రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఇరుకు రహదారి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళుతున్నారు. పూడూరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. పూడూరు మండలం మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ పరిధి బిచ్చాల్ వరకు మూడు వరుసల రోడ్డు ఉన్నా విభాగినులు, సూచికల్లేవు. పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. జాతీయ



రహదారిగా ప్రకటించడంతోపాటు ప్రమాదకారిగానూ గుర్తించారు. సర్వే పూర్తయినా..రోడ్డు విస్తరణలో భాగంగా సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. రహదారిపై మలుపుల తగ్గింపు, అండర్ పాస్‌లు నిర్మించేందుకు టెండర్లు దక్కించుకున్న సంస్థ పలుమార్లు సర్వేలు చేసింది. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలను తొలగించడంలో అవరోధాలు ఏర్పడడంతో అధికారులు చిన్న మరమ్మతులతో సరిపెట్టాల్సి వస్తోంది.

# క్షణికావేశం.. జీవితాలు బలి

హైదరాబాద్: ప్రేమ, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు... కారణమేదైనా కొందరు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నారు. నగరంలో కొన్ని రోజులుగా వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. బలవన్మరణాలకు ఎక్కువగా ఆర్థిక సమస్యలు, ఒత్తిడి భరించలేకపోవడం కారణంగా ఉన్నాయి. తాజాగా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని భరించలేక అతని తల్లి ఆత్మహత్యకు యత్నించారు. నార్సింగి ఠాణా పరిధిలో ఓ మహిళ మూడేళ్ల కూతురితో 18వఅంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

సమస్య చిన్నదైనా..: యుక్త వయసులో పలువురు ఒత్తిడి తట్టుకోలేకపోవడం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య చిన్నదే అయినా కొందరు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. ఆత్మహత్యలకు ప్రధానంగా మూడు కారణాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. వ్యక్తిగత నేపథ్యంతో పాటు మానసిక, సామాజిక పరిస్థితులు విపరీత ప్రభావం చూపిస్తాయి. వృత్తిపరమైన ఒత్తిడి, ఆర్థిక పరిస్థితులు, జీవితంలో జరిగే కొన్ని ఘటనలు, సొంతమని భావించే వ్యక్తుల అకాల మరణంతో ఒక్కసారిగా మనోవేదన ప్రారంభమవుతుంది. మరణం తప్ప మరోదారి లేదనే భావనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. నగరంలో 10 రోజుల్లో ఏకంగా 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.రోడ్డు ప్రమాదాల్లో 15–29 ఏళ్ల మధ్య వయసున్న యువత ఎక్కువగా మరణిస్తుండగా రెండో స్థానంలో ఆత్మహత్యలుండడం కలవరపెడుతోంది. 90 శాతం నివారించొచ్చు..

బాధితుల ప్రవర్తన గుర్తిస్తే ఆత్మహత్యల్లో 90 శాతం నివారించొచ్చని మానసిక వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు వారు పలు సూచనలు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు కుటుంబసభ్యులు, సహచరులతో ప్రవర్తన కొత్తగా ఉంటుంది.

ఒంటరిగా ఉంటారు. ఇతర ప్రాంతాలు, వేడుకలు, కార్యక్రమాలకు వెళ్లేందుకు ఇష్టపడరు.

కొందరు తాము జీవించి లాభం లేదంటూ తరచూ బాధపడుతుంటారు. కుటుంబ సభ్యులకు భారంగా మారామని ఆవేదన చెందుతారు. ఇష్టమైన పనులు చేయలేరు.

కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉంటారు. ఖరీదైన వస్తువులను దానం చేస్తుంటారు.

పని అప్పజెబితే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. దేన్నీ తీవ్రంగా పరిగణించరు. డ్రగ్స్, మద్యం విపరీతంగా తీసుకోవడం ఒక లక్షణం.

నిరాశలో ఉంటూ చిరాకు పడుతుంటారు. సందేహం అనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి.

బాధితులను ఓదార్చాలి..

'కొందరు సమస్యను ధైర్యంగా ఎదుర్కోకుండా మానసిక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. సమస్యల్లో ఉన్నవారిని ఓదారుస్తూ వారితో ఎక్కువ మాట్లాడేందుకు ప్రయత్నించాలి. ధైర్యం చెప్పి ఆలోచనలు మళ్లించాలి. సకాలంలో స్పందించడం అవసరం.

–డాక్టర్ నాగభైరవి, మానసిక వైద్య నిపుణులు

# కూడళ్లు మెరవాలి.. నగరం మురవాలి

హైదరాబాద్: నగర వాతావరణం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పైవంతెనలు, విభాగినులకు రంగులద్దే కార్యక్రమం మొదలైంది. పైవంతెనల కింద ఖాళీస్థలాన్ని పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు. పలు కూడళ్లలో రంగురంగుల విద్యుద్దీప కాంతులతో ఆకట్టుకునేలా ఫౌంటెయిన్లను అభివృద్ధి చేయనున్నారు. కొత్త ఆకృతులతో..గచ్చిబౌలి ఓఆర్‌ఆర్ వద్ద బస్టాప్, శేరిలింగంపల్లి జోన్‌లో అన్నపూర్ణ భోజన కేంద్రాలు, కొత్తగూడ పైవంతెన కింద మహిళా శక్తి క్యాంటీన్, ఐకియా కూడలిలో పబ్లిక్ ప్లాజా నిర్మాణానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం డిజైన్లు రూపొందిస్తోంది .అబిడ్స్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం ముందున్న నెహ్రూ కూడలిలో పొడవైన ఫౌంటెయిన్‌ను నిర్మించనున్నారు. నెహ్రూ విగ్రహాన్ని మపాత వాటిపైనా దృష్టిపెట్టాలిరింత ప్రకాశింపజేసేలా విద్యుద్దీపాలను ఏర్పాటుచేసి.. కూడలిని విస్తరించి తొమ్మిది ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. తపాలాశాఖ కార్యాలయాన్ని ప్రతిబింబించే పోస్టుబాక్సు నమూనాఏర్పాటు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

నారాయణగూడ కూడలిలో మార్కెట్ వైపున్న విభాగినిపై, ట్యాంక్‌బండ్ అంబేద్కర్ కూడలి, సచివాలయం ఎదురుగా, లక్డీకపూల్ కూడలిలోనూ ఈ తరహా నిర్మాణాలు చేపట్టనున్నట్టు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. చార్మినార్ గుల్జార్ హౌజ్ కూడలి, ఇతరత్రా ప్రాంతాల్లోని ఫౌంటెయిన్లను పునరుద్ధరించాలని, చారిత్రక కట్టడాలు, రద్దీ ప్రాంతాల్లో మరిన్ని నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు.

# ఐటీఐలకు సాంకేతిక సొబగులు



పెద్దపల్లి : పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఆదరణ కోల్పోయిన ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అధునాతన సాంకేతిక కేంద్రాలు(అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు)గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టే ఆరు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నైపుణ్య లేమితో అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులకు ఈ కేంద్రాలు బాసటగా నిలవనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 65 ఐటీఐల్లో పెద్దపల్లి, రామగుండం పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు చోటు దక్కింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఆరు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఐటీఐలో ఫిట్టర్ ఎలక్ట్రిషియన్, వెల్డర్, మెటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సుల్లో పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. దీంతో ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు అందనున్నాయి.

కోర్సు ముగియగానే ఉద్యోగంనైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందనుంది. ప్రస్తుతం టాటా కంపెనీ ఆరేళ్ల వరకు కోర్సు నిర్వహణ బాధ్యత తీసుకుంది. తర్వాత గడువు పొడిగించనున్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే అప్రెంటిస్‌షిప్ కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)కు ఆదరణ కనిపిస్తున్న నేపథ్యంలో ఐటీఐల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.

రూ. 4.77 కోట్లతో భవనం

అధునాతన సాంకేతిక కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

పెద్దపల్లి ఐటీఐ ఆవరణలో రూ. 4.77 కోట్లతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు.

ఇప్పటికే కోర్సులకు సరిపడా కొన్ని యంత్రాలు వచ్చాయి. మిగిలినవి కూడా త్వరలో రానున్నాయి.

కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటివరకు ఐటీఐలు పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు.

172 సీట్లకు అనుమతి

కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులతో విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుంది. శిక్షణ పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు దొరుకుతాయి. ఆరు కోర్సుల్లో మొత్తం 172 సీట్లకు అనుమతి ఉంది.వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్

# ఉన్నవి కూల్చి.. కొత్తవి నిర్మించక



గంభీరావుపేట : రహదారి విస్తరణ పేరుతో మండల కేంద్రం గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో పలు నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. మరోవైపు రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ఉన్న సమస్యలకు కొత్తవి తోడయ్యాయి. ఫలితంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉన్న సమయంలో గాంధీచౌక్ వద్ద ఉన్న మార్కెట్ షెడ్‌ను, పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చివేశారు. సమీకృత మార్కెట్ నిర్మిస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కూరగాయలు అమ్మేవారు, కొనేవారు ఎండలో, వానలో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మినీ బస్టాండ్, మూత్రశాలలు, దోశలగూడెం వద్ద బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌కు సంబంధించిన ప్రహరీ, దోశలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.పంచాయతీ కార్యాలయం వద్ద కాంప్లెక్స్, మూత్రశాలలు నిర్మించి ఏడాది దాటింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించి దాదాపు తొమ్మిది నెలలు అవుతున్నా వాటిని వినియోగంలోకి తీసుకురావటం లేదు. ఇటీవల కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు గదులను వేలం వేశారు. ఇందులో దక్కించుకున్న వారికి పంచాయతీ అధికారులు అప్పగించడం లేదు. అదేవిధంగా మేజర్ గ్రామ పంచాయతీకి, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు నిత్యం పనుల మీద చాలా మంది వస్తుంటారు. మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవి వినియోగంలోకి తీసుకురావడం లేదు.

ప్రధాన రహదారిలో బస్టాండ్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. చినుకులు పడితే చిత్తడిగా మారుతుంది. మరమ్మతులు చేపట్టడం లేదు.రెండు శుద్ధజల కేంద్రాలు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.చాలా చోట్ల పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. అయినా పట్టించుకోవడం లేదు.గత ప్రభుత్వం ప్రధాన రహదారి విస్తరణకు రూ. 30 కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో రోడ్డు విస్తరణ కలగా మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో వెనకబడింది

పంచాయతీ అధికారులు సమస్యలను పరిష్కరించాలి. మార్కెట్ షెడ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నది కూల్చారు. చాలా చోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ కాలేదు. అభివృద్ధిలో గంభీరావుపేట వెనకబడిపోతుంది.

జీడి హరీశ్, గంభీరావుపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మేజర్ గ్రామ పంచాయతీలోని సమస్యలను పంచాయతీకి వచ్చే నిధులతో అయ్యే వాటిని పరిష్కరిస్తున్నాం. అధిక నిధులు అవసరమున్న వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బస్టాండ్ వద్ద ఉన్న గుంతలను త్వరలోనే పూడ్చివేస్తాం. అపరిశుభ్రంగా ఉన్న చోట శుభ్రం చేస్తాం. పంచాయతీకి వచ్చే నిధులను బట్టి గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం.రాజేశ్వర్, ఎంపీవో

# ఈ సారైనా 'దిశా'నిర్దేశం చేస్తారా..?

కొత్తగూడెం : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడుతోంది. ఏటా సాధించాల్సిన లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఈ పరిస్థితిని గాడిన పెట్టాల్సిన పాలనా యంత్రాంగం ఒక 'దిశ' లేకుండా ముందుకు సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు పది నెలల విరామం తర్వాత నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో 'దిశ' కమిటీ సమావేశమవుతోంది. కనీసం తీర్మానాంశాల అమలుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. 2020లో జరిగిన సమావేశంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 72 అంశాలపై తీర్మానం చేశారు. ఆయా లక్ష్యాల సాధనపై పెద్దగా దృష్టిసారించిన దాఖలాల్లేవు. ఆ తర్వాత కరోనా విజృంభణతో రెండేళ్ల పాటు కమిటీ సమావేశమవలేదు. తిరిగి 2022 నవంబరు 26న సమావేశం నిర్వహించారు. అంతకుముందు తీర్మానాలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు శాఖల వారీ లెక్కలు చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు వాడీ వేడి చర్చకు తెరలేపారు. చివరిసారిగా 2024 జనవరి 25న అప్పటి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అధ్యక్షతన దిశ కమిటీ సమావేశమైంది. 42 అంశాలపై ప్రగతి నివేదికలను వివిధ శాఖల అధికారులు పొందుపరిచారు. తదనంతరం జరిగిన చర్చలో పలు పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. వారు లేవనెత్తిన సమస్యలపై పెద్దగా స్పందన లేదని విమర్శలు గుప్పించారు. ప్రధానంగా రైల్వే శాఖపై జరిగిన చర్చలో ఇల్లెందులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపించింది. దీనిపై ఎలాంటి స్పందన లేదు. వైద్యారోగ్య శాఖలో అప్పటి నుంచి ఇప్పటివరకు మందుల కొరత వేధిస్తూనే ఉంది. డయాలసిస్ కేంద్రాలను పెంచాలన్న లక్ష్యంలో కొంత పురోగతి కనిపించినా.. రక్తశుద్ధి సేవలకు కిడ్నీ రోగులు నిరీక్షిస్తూనే ఉన్నారు. మరిన్ని యూనిట్లు పెంచితే తప్ప ఊరట కలిగేలా లేదు. ఏజెన్సీలో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీపైనా గతంలో చర్చ లేవనెత్తారు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాల జారీ ఓ ప్రహసనంగా మారింది. దీనికి సరైన పరిష్కారం చూపాల్సి ఉంది. పీఎం గ్రామీణ సడక్ యోజన, గిరివికాస్ పథకం, మారుమూల గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం, ఏజెన్సీల్లో సెల్‌టవర్ల ఏర్పాటు ద్వారా నెట్‌వర్క్ విస్తరించాలనే అంశాలపై మరింత దృష్టిసారించాలనే డిమాండ్ ప్రస్తుతం కూడా వినిపిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను పథకాల అమలుతో పటిష్ఠపరచాలని మన్యం ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభంజిల్లా దిశ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధ్యక్షతన శనివారం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల కు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, సదుపాయాల కల్పన తీరుపై సమీక్షించనున్నారు. శాఖల వారీగా సమగ్ర సమాచారంతో అధికారులు హాజరుకానున్నారు. గత సమావేశంలో రైల్వే అధికారులు అసమగ్ర సమాచారంతో హాజరవటంపై అసంతృప్తి వ్యక్తమైంది. ఇలా తూతూమంత్రంగా కాకుండా జిల్లా అభివృద్ధికి బాటలు వేసే నిర్మాణాత్మక చర్చలో అధికారులను భాగస్వాములు కావాలన్నది ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష. ఇటీవల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీ కాలం పూర్తయినందున వారు సమావేశానికి హాజరయ్యే అవకాశం లేదు. ఖమ్మం లోక్‌సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

# ప్రమాదాల లెక్క.. తగ్గించాలి పక్కా

హైదరాబాద్:మెట్రో నగరాలు, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను తగ్గించాలంటే రహదారి భద్రత గణన (రోడ్‌సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు నిర్ధారించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయిల్లో ఈ 9 నెలల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, వీటిని నియంత్రించపోతే పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. రెండేళ్లలో మెట్రో నగరాలలోని రహదారులు, వాటికి సమీపంలోని జాతీయ రహదారులపై నమోదైన ప్రమాదాలను విశ్లేషించారు. నిర్వహణ లోపాల కారణంగా 40 శాతం జరుగుతున్నాయని గుర్తించారు. రోడ్ సేఫ్టీ ఆడిట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించి చర్యలు చేపడితే రోడ్డు ప్రమాదాలను 10 నుంచి 20 శాతానికి తగ్గించవచ్చని పట్టణ పర్యావరణ అధ్యయన ప్రాంతీయకేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. రహదారుల నిర్మాణం... వాహనాల రాకపోకలు: ప్రమాదాలు తగ్గించేందుకు రహదారుల నిర్మాణం, వాహనాల రాకపోకలపై సమగ్ర సమాచారం ఉండాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాల రాకపోకల పెరుగుదలను అంచనా వేసి అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణంలో వినియోగించాలి. హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు జాతీయ




రహదారుల నిర్మాణ సమయంలో, అందుబాటులోకి వచ్చాక లెక్కలన్నీ మారిపోయాయి. పండగ సెలవులొస్తే చాలు అన్ని టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. దీంతో రహదారులపై ఒత్తిడి పెరిగి తరచూ ప్రమాదాలు నమోదవుతున్నాయి.

లెక్కల గణనలో అన్ని వివరాలు..

జాతీయ, రాష్ట్ర రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ, పర్యావరణ అధ్యయన ప్రాంతీయ కేంద్రం పరిశోధక బృంద సభ్యులు అధ్యయనం చేశారు. నగరంలోని రహదారులు, బాహ్యవలయ రహదారి, హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–బెంగళూరు రహదారులపై సైన్‌బోర్డులు, రేడియం బోర్డులు కొన్ని ప్రాంతాల్లో లేవని గుర్తించారు. హైదరాబాద్–విజయవాడ రహదారిపై రాత్రివేళల్లో ట్రక్కులు, లారీలను నిలపడంతో వాహనదారులు వాటిని గమనించక ఢీకొడుతున్నారన్నారు.

ప్రయోజనాలు... నియంత్రణ

రహదారి భద్రతను సమీక్షించే ఆడిట్ వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు కొన్ని మార్గాల్లో వీటిని ఏర్పాటు చేయాలి.

ఈ ఆడిట్‌ను పర్యవేక్షించే అధికారులు జాతీయ, రాష్ట్ర రహదారుల మరమ్మతులపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలను సమర్పించేందుకు వీలుంటుంది. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆడిట్ ద్వారా ఒక రహదారిపై ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎందుకు జరిగాయి? తెలిస్తే ప్రమాదాలు తగ్గించే వీలుంటుంది.

# అయ్యో రామా.. ఎన్నాళ్లిలా..?

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాధికారులు, ఉద్యోగుల మధ్య అగాధం ఏర్పడుతోంది. అధికారుల నిర్ణయాలు సరిగ్గానే ఉంటాయంటున్నా.. కొన్నిసార్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు సిబ్బంది సరిపడా లేరనే కారణంతో గురువారం కొన్ని గంటల పాటు తాళాలు వేసి ఉంచటం వివాదాస్పదమైంది. సర్దుబాటు చేసే పరిస్థితి ఉన్నా కావాలనే కొందరు ఉద్యోగులు ఈ తతంగం నడిపించారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంపై అదేరోజు సాయంత్రం ఈఓ రమాదేవి తమ ఉద్యోగులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశ క్రతువును వీడియో తీయించారంటే ఇక్కడ నెలకొన్న అపనమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ధర్మకర్తల మండలి ఏర్పడితే పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకునే వీలుంటుంది. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చుననే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధిపై అడుగు పడాలంటే..రామాలయ అధికారులు చురుగ్గా వ్యవహరిస్తుండటంతో గతేడాది రూ. 80కోట్లు ఉన్న ఆదాయం ఈసారి రూ. 100 కోట్లకు చేరుకునే వీలుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రూ. 60. 20కోట్లు కేటాయించింది. రూ.కోటితో కల్యాణమండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇలాంటి కీలక సమయంలో వివాదాలు తగవని భక్తులు చెబుతున్నారు. సమన్వయలోపం తలెత్తకుండా ఈఓ, వైదిక బృందం చొరవ చూపాలని కోరుతున్నారు. కలహాలు తీరేనా..?ఇటీవల ఆలయ ప్రధానార్చకుడు, అతడి కుమారుడు కుటుంబ కలహాలతో రచ్చకెక్కాల్సి వచ్చింది. వీరిద్దరిపై కేసు నమోదు కావటంతో సస్పెండయ్యారు. ఇటీవల ఇద్దరు వైదిక పెద్దలు దసరా ఉత్సవాలకు తిరుపతి వెళ్లి ప్రవచనాలిచ్చారు. సెలవు తీసుకోకుండా ఎలా వెళ్తారని వీరికి ఈఓ మెమోలు జారీ చేశారు. ఓ అర్చకుడు ఇక్కడ విధులకు హాజరవకుండా వేరే దేశం వెళ్లారు. అతడిని విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా ఆస్థాయిలో పోస్టులను భర్తీ చేయటం లేదు.

ఇక్కడి అవసరాల నిమిత్తం సిబ్బంది సంఖ్య పెంచాలి. 36 మంది వైదిక సిబ్బంది సేవలందించాల్సి ఉంది. పరిచారక పోస్టులను భర్తీ చేయకపోవటంతో తీర్థప్రసాదాల పంపిణీ భారంగా మారుతోంది. ఈతరహా సమస్యలకు మూలాలు తెలిసిన వైదిక పెద్దలు వీటిని పరిష్కరించేందుకు చొరవ చూపటం లేదు. గొడవలు వచ్చినా అంతర్గత ఆలయాలను మూసే పరిస్థితి రాకుండా చూడాలి.




అమరావతి: అదానీతో జగన్ ఒప్పందం రాష్ట్రంలోనే కాదు.. అంతర్జాతీయంగానూ చరిత్రే అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రూ.1,750 కోట్లు సీఎంకు ముడుపులు ఇవ్వడం చరిత్రే అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అబద్ధాలను అందంగా అల్లినందుకు జగన్‌కు ఆస్కార్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. సన్మానాలు కోరుకునే ముందు జగన్ కొన్ని ప్రశ్నలకు జవాబివ్వాలని డిమాండ్ చేశారు. యూనిట్ ధర రూ. 2.14 ఉంటే.. జగన్ రూ. 2.49కు కొన్నారని పేర్కొన్నారు. ఎక్కువ ధర చెల్లించి కొన్నందుకు జగన్‌ను సన్మానించాలా..? అని ప్రశ్నించారు. "అదానీ వద్ద గుజరాత్ రూ.1.99 పైసలకే విద్యుత్ కొనుగోలు చేసింది. మీరు యూనిట్‌కు 50 పైసలు ఎక్కువ పెట్టి కొన్నారు. అదానీతో ఒప్పందానికి మిగిలిన రాష్ట్రాలు ముందుకు రాలేదు. ఆగమేఘాలపై ఒప్పందం చేసుకున్న జగన్‌ను సన్మానించాలా..? సీఎంను వ్యాపారవేత్తలు గోప్యంగా కలవడం ఎక్కడైనా ఉందా..?" "ఎవరూ కొనని విద్యుత్‌ను బంపర్ ఆఫర్‌గా ప్రకటించుకోవడం చరిత్రే. గంటల్లోనే కేబినెట్ సమావేశం పెట్టడం చరిత్రే. ప్రజాభిప్రాయం లేకుండా ఒప్పందాలకు ఆమోదం చరిత్రే. అదానీ కోసం అన్ని టెండర్లు రద్దు చేయడమూ చరిత్రే. ఒక వ్యక్తి స్వార్థం కోసం రాష్ట్ర ప్రజలపై భారం మోపుతారా..? ప్రజల నెత్తిన రూ. 1.67 లక్షల కోట్ల భారాన్ని మోపడం చరిత్రే. ప్రపంచమంతా మీ అవినీతి గురించి మాట్లాడుకోవడం చరిత్రే. ప్రపంచ అవినీతిపరుల జాబితాలో మీ పేరు చేరడం పెద్ద చరిత్రే" "అమెరికా కేసులో తన పేరు ఎక్కుడుందని జగన్ బుకాయిస్తున్నారు. ఏపీ సీఎం అంటే ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి కాదా..? సీఎం కుర్చీలో మీరు కాక.. మిమ్మల్ని నడిపించే వాళ్లు కూర్చున్నారా..? ఇదేం అహంకారపు తిరస్కరణ సమాధానం..? జగన్ అవినీతి చేశారని అమెరికా దర్యాప్తు సంస్థలే చెప్పాయి. అదానీకి 25 ఏళ్లు రాష్ట్రాన్ని జగన్ తాకట్టు పెట్టారు.

రాష్ట్రాన్ని తాకట్టు పెట్టినందుకు జగన్‌కు ఎంత ముట్టిందో అర్థమవుతోంది. గంగవరం పోర్టును రూ.640 కోట్లకే జగన్ అమ్మేశారు. ఈ పోర్టును అమ్మినప్పుడే ముడుపుల బంధం తేలిపోయింది. రాష్ట్రాన్ని బ్లాంక్ చెక్కులా అదానీకి జగన్ కట్టబెట్టారు. అదానీ వల్ల ఆర్థికంగా లబ్ధి పొందలేదని జగన్ ప్రమాణం చేస్తారా..?దమ్ముంటే ఈ సవాల్‌ను జగన్ స్వీకరించాలి " అని షర్మిల డిమాండ్ చేశారు.

# నేడు అనంతపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

### - నేమకల్లులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ - గ్రామ ప్రజలతో సమావేశం.. అర్జీల స్వీకరణ



అనంతపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకరోజు పర్యటనలో భాగంగా బొమ్మనహాల్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీలో భాగస్వాములవుతున్నారు. రచ్చబండ తరహాలో నేమకల్లు గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశమౌతారు.

**సీఎం పర్యటన షెడ్యూల్..** - శనివారం ఉదయం 11 గంటలకు: తాడేపల్లిలోని నివాసం నుంచి రోడ్డు మార్గాన విజయవాడ విమానాశ్రాయానికి బయలుదేరుతారు. - 11.40: విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.25 గంటలకు బెంగళూరు విమానాశ్రాయానికి చేరుకుంటారు. - 12.45: బెంగళూరు విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. - 12.45 గంటల నుంచి 12.50 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. - 12.50 గంటల నుంచి 1.20 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. - 1.20 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.25 గంటలకు నేమకల్లు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు. - 1.25 గంటల నుంచి 1.55 గంటల వరకూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. - 1.55 గంటల నుంచి 2.00 గంటల వరకూ నేమకల్లులోని ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత 3.05 గంటల వరకూ స్థానిక ప్రజలతో సమావేశమవుతారు. - మధ్యాహ్నం 3.10 గంటలకు నేమకల్లు హెలిప్యాడ్‌కు చేరుకొని 3.15 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. - 3.45 గంటలకు హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరుతారు.

# జనవరి నాటికి ఏపీలో గుంతలు లేని రహదారులు: మంత్రి అనిత

వైకాపా హయాంలో రోడ్లన్నీ నీటి కుంటలుగా మారినా పట్టించుకోలేదని హోంమంత్రి అనిత విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రహదారులన్నీ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నర్సీపట్నం- అడ్డరోడ్డు ఆర్ అండ్ బీ రహదారి అభివృద్ధి పనులకు హోంమంత్రి శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 24 కోట్లతో ఈ రోడ్డుని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జనవరి నాటికి రాష్ట్రంలో.. గుంతలు లేని రహదారులే ప్రభుత్వ లక్ష్యమని అని మంత్రి అనిత చెప్పారు.



# నేను పరారీలో లేను.. పోలీసుల విచారణపై వర్మ వితండవాదం



అమరావతి, నవంబర్ 29: సోషల్ మీడియాలో అసభ్య కర పోస్టుల వ్యవహారంలో వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మ రెండు సార్లు పోలీసుల విచారణకు డుమ్మా కొట్టిన విషయం తెలిసిందే. అయితే గత వారం రోజులుగా పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న వర్మ... సోషల్ మీడియాలో మాత్రం తెగ యాక్టివ్‌గా ఉంటూ వస్తున్నారు.

తాజాగా పలు ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు కూడా ఇస్తూ... తాను పరారీ లేనంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించి అలాగే పోలీసుల విచారణపై ఎక్స్ వేదికగా తనదైన రీతిలో వితండవాదం చేస్తున్నారు. పోలీసులు తన ఆఫీస్‌లోనికి రాలేదని, తాను తన డెన్‌లోనే ఉన్నానని.. అప్పుడప్పుడు షూటింగ్‌లకు వెళ్లొచ్చానని వర్మ చెప్పుకుంటున్నారు.

**వర్మ పోస్టు...** ఇది నా ఒక్కడి సమస్య కాదు అందరి సమస్య అంటూ పోస్టులు పెట్టిన వర్మ.. సమాజాన్ని ఉద్ధరించే వాడిలా కవరింగ్‌లు ఇస్తున్న పరిస్థితి. ఏకంగా చట్టాలనే మార్చాలని ఆర్జీవీ అనడం విడ్డూరంగా ఉంది. "ఇది నాపై కేసు గురించి కాదు.. కానీ సరైన సమయం.. సంబందించిన వారందరూ చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో ఎక్కువగా ఉన్నది ఏమిటి? అది ఎందుకు ఎక్కువ? దీన్ని ఎవరు ఎలా ఎక్కువ ఏది నిర్ణయిస్తారు? ప్రస్తుత చట్టాల అమలులో ఈ స్థిరమైన అసమానత, వివక్షకు బదులుగా తదనుగుణంగా చట్టాలను రూపొందించమంటూ" ఎక్స్‌లో పోస్టు చేసిన వర్మ... ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు , తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలను ట్యాగ్ చేశారు. అయితే నేను పరారీలో లేను అని చెప్పుకుంటున్న వర్మ.. "ఒంగోలు పోలీసులు ఆఫీస్ బయట ఉన్నప్పుడు ఎందుకు తన మనుషులతో వర్మ ఎవరికి అందుబాటులో లేడని మీడియా ముఖంగా చెప్పాడు.. వర్మకు భయం లేదని.. వర్మ లాంటి వీఐపీ మీద పోలీసుల చేయి వేస్తే ..చూస్తూ ఊరుకుంటామా అంటూ అతని లీగల్ టీమ్ ఎలివేషన్స్ ఇచ్చింది. కోర్ట్‌లో వరుస పిటిషన్స్ వేయటం వెనుక రీజన్.. భయం కాక ఇంకేమనుకోవాలి..!! షెడ్యూల్ ప్రకారం షూటింగ్‌లు ఉన్నందు వల్ల .. విచారణకు సమయం అడిగిన వర్మకు .. ఇంటర్వ్యూ ఇచ్చేందుకు సరిపడా సమయం ఉందా.. ఇప్పటికే మార్ఫింగ్ ఫోటోలతో .. సిల్లీ పోస్ట్‌లతో వర్మ పరిధి ధాటి సోషల్ మీడియాలో తన సైకోయిజం చూపించాడు.. ఇప్పుడు చట్టం మీద గౌరవం లేకుండా , దేశ పౌరుడిగా బాధ్యత లేకుండా పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతూ వారిమీదే తిరిగి అబాండాలు వేసె స్థాయికి వచ్చేశాడు. వర్మకు తాను చేసింది తప్పని తెలిసి కూడా అనవసరమైన లాజిక్‌లకు పోతూ.. వ్యవహారాన్ని మరింత సీరియస్ గా మార్చుకుంటున్నాడనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్స్ పోస్ట్‌లతోనో.. వాటికి కొన్ని ఛానెల్ ట్యాగ్‌లతోనో.. పోలీసులను భయపెట్టాదామని చూస్తున్న వర్మకు అతనెక్కడున్నా ఏ అర్థరాత్రో వచ్చి ఎత్తుకెళ్లగలరనేది అర్థం కావట్లేదా" అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది . కాగా.. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు సంబంధించిన కేసులో డైరెక్టర్ రాంగోపాల్ వర్మ రెండు సార్లు పోలీసుల విచారణకు గైర్హాజరైన విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో రాంగోపాల్ వర్మ విచారణను ఎదుర్కుంటున్నారు. దీనికి సంబంధించి ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో వర్మపై కేసు నమోదు అయ్యింది. మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో టీడీపీ మండల కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారు. మొదటి సారి ఈనెల 19న వర్మ పోలీసుల ఎదుట విచారణకు రావాల్సి ఉండగా.. వారం రోజులు గడువు కావాలని కోరారు. వర్మ విజ్ఞప్తి మేరకు పోలీసులు వారం రోజులు గడువు ఇచ్చారు. దీంతో ఈనెల 25న మరోసారి ఒంగోలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రాంగోపాల్ వర్మ కేసు విచారణ జరగాల్సి ఉంది. అయితే రెండో సారి విచారణకు కూడా డైరెక్టర్ డుమ్మా కొట్టేశారు. విచారణకు హాజరుకావడం లేదంటూ తన లాయర్ శ్రీనివాస్‌కు వర్మ సమాచారం ఇచ్చారు. ఇదే విషయాన్ని లాయర్ పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసుల విచారణకు రాని నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. వెంటనే వర్మ నివాసానికి పోలీసులు చేరుకోగా.. ఆయన ఇంట్లో లేరని చెప్పడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.




# ఘోరం.. బైక్‌ను తప్పించబోయి బస్సు బోల్తా.. 10 మంది మృతి

ముంబయి: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భండారా నుంచి గోండియా వెళ్తున్న ప్రయాణికుల బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు మృతిచెందగా.. మరో 30 మంది వరకు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బైక్‌ను తప్పించే ఈ క్రమంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం భండారా నుంచి బయల్దేరిన బస్సు కోహ్‌మారా హైవేపై వెళ్తుండగా ఉన్నట్టుండి ఓ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చింది. దాని తప్పించే క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ఇంకోవైపునకు తిప్పడంతో బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరగ్గానే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. బస్సు ప్రమాద ఘటనపై భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోండియా జిల్లాలోని సడక్ అర్జుని సమీపంలో చోటుచేసుకున్న ఘటన దురదృష్టకరమన్నారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఈ ఘటనలో క్షతగాత్రులకు అవసరమైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారని, సమన్వయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు.




విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనం అందజేశారు. దుర్గగుడి ఈవో రామారావు.. అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని, శేష వస్త్రాలను బహూకరించారు.




గుడివాడ: ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఎన్టీఆర్ కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గంలోని 43 గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. రూ.3.36 కోట్లతో గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లకు అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. ప్రభుత్వం తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ పిటిషన్.. భాస్కర్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

దిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. భాస్కర్‌రెడ్డికి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. భాస్కర్‌రెడ్డికి ఇటీవల బెయిల్ మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తొలుత బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయమూర్తే మళ్లీ బెయిల్ మంజూరు చేశారని దర్యాప్తు సంస్థ ప్రధానంగా అత్యున్నత న్యాయస్థానం ముందుంచింది. మరోవైపు వివేకా కుమార్తె సునీత తరపు న్యాయవాదులు స్పందిస్తూ ఈ కేసులో మిగతా నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లూ దాఖలయ్యాయని.. వాటితో భాస్కర్‌రెడ్డికి సంబంధించిన పిటిషన్ కూడా జత చేయాలని కోరారు.




అనంతరం సుప్రీంకోర్టు భాస్కర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. వివేకా హత్య కేసుల్లో ఇప్పటికే దాఖలైన మిగిలిన పిటిషన్లతో ఆయన బెయిల్ రద్దు పిటిషన్‌ను జత చేయాలని ఆదేశించింది. వాటితో పాటే సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

# ఎన్‌డీపీఎస్ చట్టం ఎంత కఠినమైందో అందరికీ తెలియాలి: ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ



అమరావతి: డ్రగ్స్ తీసుకున్నా.. సరఫరా చేసినా నేరమేనని 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణ స్పష్టం చేశారు. ఏపీలో గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈఏజీఎల్ఈ- ఈగల్)ను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఆకే రవికృష్ణ మీడియా సమావేశం నిర్వహించారు. "డ్రగ్స్, గంజాయి నివారణపై అవగాహన అవసరం. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) చట్టం ఎంత కఠినమైందో అందరికీ తెలియాలి. విద్యార్థులు, యువతకు త్వరలోనే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి ఏడాది నుంచి 20 ఏళ్ల వరకు శిక్షలు ఉన్నాయి. రూ.2లక్షలకు పైగా జరిమానా కూడా విధించే అవకాశముంది. ఒకసారి ఈ చట్టం కింద విద్యార్థిపై కేసు నమోదైతే అతడికి చాలా నష్టం జరుగుతుంది" అని వివరించారు.

# శ్రీలీల అన్‌స్టాపబుల్ శారీ లుక్

టాలీవుడ్‌లో బిజీయెస్ట్ హీరోయిన్లలో ఒకరైన శ్రీలీల వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతోంది. అయితే తన బిజీ షెడ్యూళ్లకు బ్రేక్ ఇచ్చి ఆహా టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ NBK`లో శ్రీలీల ప్రత్యేక అతిథిగా కనిపించింది. ఈ ఎపిసోడ్‌లో తనతో పాటు నవీన్ పోలిశెట్టి కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం అన్ స్టాపబుల్ షో షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ స్పాట్ నుంచి బయటకు వచ్చిన ఫోటోగ్రాఫ్స్ లో శ్రీలీల ఎర్ర చీర లుక్ ఆకట్టుకుంది. ఈ తెలుగు భామ ఫ్యాషన్ సెన్స్ ఇప్పుడు హాట్ టాపిగ్గా మారింది. చోకర్, పొడవాటి చెవిపోగులు, కంకణాలతో శ్రీలీల అద్భుతంగా కనిపించింది. ఎంపిక చేసుకున్న ఎరుపు రంగు చీరకు తగ్గట్టే కాంబినేషన్ బ్లౌజ్ శ్రీలీల అందాన్ని



మరింతగా పెంచింది. బాలయ్య షోలో శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. బ్లాక్ బస్టర్ భగవంత్ కేసరిలో శ్రీలీల నటసింహంతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడిలా ఈ షోకి హాజరు కావడం ఎగ్జయిట్ చేస్తోంది.

నవీన్ - బాలకృష్ణలతో పాటు శ్రీలీల అప్పియరెన్స్ ఎపిసోడ్ కి పెద్ద ప్లస్ కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రోమో ఆకట్టుకుంది. శ్రీలీల ఇటీవలే పుష్ప- 2లో కిస్సిక్ లిరికల్ సాంగ్‌లో అద్భుతంగా కనిపించింది. ఈ పాటు 5కోట్లు పైగా వీక్షణలతో వైరల్ గా దూసుకెళ్లింది. ఈ పాటలో నర్తించినందుకు శ్రీలీల భారీ పారితోషికం అందుకుందన్న టాక్ కూడా ఉంది. ఊ అంటావా.. పాట కోసం సమంతకు 5కోట్లు ఆఫర్ చేయగా, శ్రీలీలకు కిస్సిక్ కోసం 2కోట్ల వరకూ పారితోషికంగా చెల్లించారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## 'కుబేర' రంగంలోకి దిగేది అప్పుడేనా?

కోలీవుడ్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ములా దర్శకత్వంలో కుబేర పాన్ ఇండియాలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇది ముంబై బ్యాక్ డ్రాప్ మాఫియా స్టోరీ. ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ప్రస్తుతం చివరి దశ షూటింగ్ దశలో ఉందీ సినిమా. ప్రధాన పాత్ర ధారులపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. నాగార్జున, ధనుష్ మునుపెన్నడు పోషించని పాత్రలు పోషిస్తున్నారు. ఇరువురి ఫస్ట్ లుక్ పోస్టర్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇంత వరకూ రిలీజ్ తేదీపై సరైన క్లారిటీ



రాలేదు. తాజాగా దానికి సంబంధించిన లీకులు అందుతున్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గట్టు పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్లాన్ చేసుకుని మేకర్స్ ముందుకెళ్తున్నట్లు సమాచారం. శేఖర్ కమ్ములా యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిస్తున్నారు. ఇలాంటి జానర్లో కమ్ములా ఇంతవరకూ సినిమా చేయలేదు. ఆయన సినిమాలు ఇంతవరకూ సాఫ్ట్ గానే కనిపించాయి. హీరోలు ఫైటింగ్ లు చేయడం అన్నది ఏ సినిమాలో లేదు. తొలిసారి ఆయన మార్క్ ని పక్కనబెట్టి దర్శకుడిగా కొత్తగా ట్రై చేస్తున్నారు. అయితే ఆ ప్రయత్నం ఇన్నోవేటివ్ గా ఉ ంటుంది అన్నది ప్రేక్షకుల నమ్మకం. లీడర్, ఆనంద్ లాంటి కెరీర్ ఆరంభంలో చేసిన చిత్రాలతోనే కమ్ములా అంటే మార్కెట్ లో ఓ బ్రాండ్ పడి పోయింది. ఆయన చేసిన సినిమాలు డిజాస్టర్ అయిన చరిత్ర ఇంత వరకూ ఏ సినిమాకు లేదు. హిట్...యావరేజ్ గా ఆడిన చిత్రాలే. ఈసారి కుబేర కోసం ఏకంగా ఇద్దరి స్టార్లను రంగంలోకి దించి చేస్తున్నారు. దీంతో అంచనాలు పీక్స్ లో ఉన్నాయి.




# 'బచ్చల మల్లి' టీజర్.. ఊర మాస్ నరేష్




టాలీవుడ్ నటుడు అల్లరి నరేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ బచ్చల మల్లి. సోలో బ్రతుకే సో బెటర్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సుబ్బు మంగాదేవి తెరకెక్కిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్న ఆ మూవీని హాస్యా మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండ, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న రిలీజ్ చేయనున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై పాజిటివ్ బజ్ బాగానే క్రియేట్ అయింది. పోస్టర్స్, గ్లింప్స్, సాంగ్స్.. అన్నీ అలరించాయి. అదే జోష్ తో తాజాగా మేకర్స్ టీజర్ ను రిలీజ్ చేశారు. బచ్చల మల్లి మండుతున్న ఫైరీ స్పార్క్ అంటూ క్యాప్షన్ ఇవ్వగా.. ప్రస్తుతం టీజర్ నెట్టింట వైరల్ గా మారింది. ఎవ్వరినీ పట్టించుకోని, ఎవ్వరి కోసం మారకూడదని భావించే పల్లెటూరి వ్యక్తి కథాంశంతో బచ్చల మల్లి మూవీ ఉంటుందని టీజర్ క్లారిటీ ఇచ్చేసింది. హీరోయిన్ అమృతా అయ్యర్ హీరో జీవితాన్ని ఎలా మార్చిందని పాయింట్ తో సినిమా నడుస్తుందని అర్థమవుతోంది. వారి జీవితంలో ఎదురైన సంఘటనల చుట్టూ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. టీజర్ ప్రకారం.. బచ్చల మల్లి మూవీలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంత మాస్ లుక్ లో నరేష్ కనిపించనున్నారని అర్థమవుతోంది. ఫుల్ గా గడ్డంతో చాలా ఆయన లుక్ రగ్డ్ గా ఉంది. సినిమాలో పూర్తిగా రఫ్ అండ్ రగ్డ్ లుక్ లో కనిపించడమే కాకుండా.. మొండితనం, మూర?త్వం ఉన్న రోల్ లో సినీ ప్రియులను అలరించనున్నట్లు తెలుస్తోంది. ఓవరాల్ గా టీజర్ సూపర్ గా ఉందని, అల్లరి నరేష్ మరోసారి బచ్చల మల్లిగా అదరగొట్టేందుకు సిద్ధమయ్యారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. హీరో, హీరోయిన్ల మధ్య వచ్చే డైలాగ్స్ తెగ మెప్పిస్తున్నాయని అంటున్నారు. మందుతో పాటు అప్పుడప్పుడు నాకు అమ్మాయిల అలవాటు కూడా ఉందని నరేష్ చెప్పిన డైలాగ్ క్రేజీగా ఉందని చెబుతున్నారు. విశాల్ చంద్రశేఖర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, అల్లరి నరేష్ పెర్ఫార్మెన్స్, దర్శకుడు సుబ్బు మంగాదేవి విజన్ తో పాటు ఓవరాల్ టీజర్ కంటెంట్.. సినిమాపై అంచనాలు పెంచుతోందని అంటున్నారు. వేరే లెవెల్ బజ్ క్రియేట్ అవుతుందని చెబుతున్నారు. మరి క్రిస్మస్ కానుకగా రిలీజ్ కానున్న బచ్చల మల్లి మూవీ.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# రాజాసాబ్ ట్రీట్ ఎప్పుడు.. రెబల్ ఫ్యాన్స్ వెయిటింగ్..!



రెబల్ స్టార్ ప్రభాస్ కల్కి తో సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు. కల్కి 2898 %ూణ% సినిమాతో మరోసారి తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు. ఐతే నెక్స్ట్ మారుతి డైరెక్షన్ లో రాజా సాబ్ సినిమాను చేస్తున్న ప్రభాస్ ఆ సినిమాతో మరోసారి తన సత్తా చాటాలని చూస్తున్నాడు. సలార్, కల్కి లాంటి డిఫరెంట్ సినిమాలు చేస్తున్న ప్రభాస్ సడెన్ గా మారుతి డైరెక్షన్ లో సినిమా చేయాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందో కానీ ఈ సినిమా థ్రిల్లర్ జోనర్ లో ఆడియన్స్ ని థ్రిల్ చేస్తుందని అంటున్నారు. కామెడీ మీద మంచి పట్టున్న మారుతి రాజా సాబ్ సినిమాతో నెక్స్ట్ లెవెల్ కి వెళ్తాడని తెలుస్తుంది. ఐతే సినిమా నుంచి ఇప్పటివరకు కేవలం ఒక గ్లింప్స్ ఇంకా మోషన్ పోస్టర్ మాత్రమే వచ్చాయి. గ్లింప్స్ లో ప్రభాస్ స్టైలిష్ లుక్ ఇంప్రెస్ చేయగా మోషన్ పోస్టర్ ఆడియన్స్ కు షాక్ ఇచ్చింది. మారుతి ఈసారి ఏదో పెద్దగానే ప్లాన్ చేసినట్టు మోషన్ పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సినిమా మీద నిర్మాతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఐతే సినిమా నుంచి ఇప్పటివరకు వచ్చిన అప్డేట్స్ ఫ్యాన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేయగా రాజా సాబ్ టీజర్ కోసం ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజా సాబ్ టీజర్ ని కుదిరితే డిసెంబర్ 25 క్రిస్ మస్ కానుకగా లేదా జనవరి 1 న్యూ ఇయర్ సందర్భంగా రిలీజ్ చేయాలని చూస్తున్నారు. ప్రభాస్ రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతుంది మాళవిక మోహనన్.

మలయాళ భామ అయిన మాళవిక డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే కానీ డైరెక్ట్ తెలుగు సినిమా ఇదే అవ్వడం విశేషం. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాపై అంచనాలు కూడా భారీగా ఉన్నాయి. మారుతి ప్రభాస్ కలిసి చేస్తున్న రాజా సాబ్ పై ఎక్స్ పెక్టేషన్స్ భారీగానే ఉన్నాయి. మరి వాటికి తగినట్టుగా సినిమా ఉంటుందా లేదా అన్నది చూడాలి. ప్రభాస్ రాజా సాబ్ సినిమాను 2025 ఏప్రిల్ 10న రిలీజ్ లాక్ చేశారు. నెక్స్ట్ సమ్మర్ కి రెబల్ స్టార్ రాజా సాబ్ ఫ్యాన్స్ కు సూపర్ ట్రీట్ ఇచ్చేందుకు వస్తున్నాడు.

# మోడల్ కం నటి బమ్ డిగ్గీ డిగ్గీ బమ్

కార్తీక్ ఆర్యన్ 'సోను కే టిటు కి స్వీటీ'లో 'బమ్ డిగ్గీ డిగ్గీ బమ్' పాట యూత్ ని కట్టి పడేసిన సంగతి తెలిసిందే. ఈ పాటలో యువ మోడల్ కం నటి సాక్షి మాలిక్ అందచందాలు కవ్వింతకు ఫిదా కానివాళ్లు లేరు. అర్మాన్ మాలిక్ 'వెహం' మ్యూజిక్ వీడియోలోను మాలిక్ ప్రతిభకు గుర్తింపు దక్కింది. ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ గా ఫిట్నెస్ ఫ్రీక్ గా సాక్షికి అరుదైన రికార్డు ఉంది. సాక్షి సోషల్ మీడియాల్లో నిరంతర ఫోటోషూట్లను షేర్ చేస్తూ ట్రెండింగ్ లో ఉంది. ఈ భామ షేర్ చేసిన తాజా లుక్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. బ్లాక్ గౌన్ లో



సాక్షి భంగిమలు హీటెక్కిస్తున్నాయి. ఈ గౌన్ డిజైన్ కూడా అంతే ఇంట్రెస్టింగ్ . ఎంపిక చేసిన డిజైనర్ గౌన్ థై హై ఎలివేషన్ తో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. సాక్షి బోల్డ్ మోడల్.. నటిగా రాణిస్తోంది. మునుముందు తెలుగు చిత్రసీమలోను అవకాశాలు అందుకుంటుందేమో చూడాలి. సాక్షి మాలిక్ .. సినిమాల్లో నటిస్తూనే బ్రాండ్లకు మోడలింగ్ చేస్తోంది.

టీవీ కమర్షియల్స్ తో ఆరంభం ఆడియెన్ కి చేరువైంది. తర్వాత సినీరంగంపై దృష్టి సారించింది. సౌత్, నార్త్ ఎక్కడైనా పెద్ద కథానాయికగా వెలిగిపోవాలని కలలు గంటోంది. ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ వెతికేస్తున్న ఈ భామకు ఇంకా టాలీవుడ్ గేట్స్ తెరుచుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఇన్ స్టా వేదికగా చెలరేగుతున్న సాక్షి యూట్యూబ్ చానెల్లో ఫిట్నెస్ క్లాసులతోను ఆకట్టుకుంటోంది.

## నభా స్టైల్ ఐకాన్ 2.0 .. ఎందుకో తెలుసా?

2022లో కార్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నభా నటేష్ ఆ తర్వాత కోలుకోవడం మిరాకిల్. ప్రమాదంలో ఈ భామ భుజం విరిగింది. చాలా చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా శస్త్ర చికిత్సలు జరిగాయి. అన్నిటి నుంచి కోలుకుని ఇప్పుడిలా వేడెక్కించే ఫోటోషూట్లతో గుబులు రేపుతోంది. వరుసగా సినిమాల్లో నటిస్తూ బిజీ అవుతోంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత చాలా గ్యాప్ వచ్చింది. ఓటీటీ చిత్రం మ్యాస్ట్రోతో వచ్చినా అంతగా గుర్తింపు దక్కలేదు. ఇప్పుడు నిఖిల్ సరసన స్వయంభు లాంటి పాన్ ఇండియా చిత్రంలో అవకాశం అందుకుంది. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న నాగబంధం అనే చిత్రంలో నటిస్తోంది. ఇందులో విరాట్ కర్ణ తన సహనటుడు కాగా అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోంది. కరోనా మహమ్మారీ, యాక్సిడెంట్ లాంటి కష్ట కాలం తనను చాలా సరి చేసిందని ఇప్పుడు తాను ఆలోచించే విధానం మునుపటితో పోలిస్తే పూర్తిగా మారిందని



కూడా నభా ఇటీవలి ఇంటర్వ్యూలో తెలిపింది. ఏది ఏమైనా కానీ నభా ఎప్పటికీ సోషల్ మీడియా క్వీన్ గా మెరిపిస్తూనే ఉంది. అద్భుతమైన కెరీర్ కోసం నభా పరుగు ఇటీవల స్పీడందుకుంది. దానికి తగ్గట్టే సోషల్ మీడియాల్లో లేటెస్ట్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా నభా షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. నభా ఓ ప్రయివేట్ పురస్కారాల్లో స్టైల్ ఐకన్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంలో ఖరీదైన ఫైవ్ స్టార్ హోటల్ ప్రాంగణంలో లైట్నింగ్ కాంతుల్లో నభా ఇచ్చిన ఫోజులు మతులు చెడగొడుతున్నాయి. నభా అల్ట్రా స్టైలిష్ ఫ్రాక్ లో కనిపించింది. బ్లాక్ ఫ్రాక్.. దానికి డిజైనర్ పట్టీ జోడించి నభా నటేష్ లైట్ మేకప్ తో కిల్లర్ లుక్ తో కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.




## ఇంకా వీడని ఉత్కంఠ.. సీఎం పదవిపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం: శిందే

మహారాష్ట్ర కొత్త సీఎం ఎవరో తెలుసుకోవడానికి ఇంకా వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రకటన వస్తుందని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వెల్లడించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశం అనంతరం ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. "మహారాష్ట్ర సీఎం పదవిపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ ఏర్పాటుపై సానుకూల చర్చలు జరిగాయి. ముంబయిలో మరోసారి చర్చించిన అనంతరం దీనిపై నిర్ణయం ప్రకటిస్తాం.

మిత్రపక్షాల మధ్య మంచి సమన్వయం ఉంది. మేమంతా సానుకూలంగా ఉన్నాం. ప్రజలు మాకు ఇచ్చిన స్పష్టమైన తీర్పుపై మాకెంతో గౌరవం ఉంది. త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాం. మేం నిర్ణయం తీసుకున్నప్పుడు మీకు తెలుస్తుంది" అని శిందే వెల్లడించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి భారీ విజయాన్ని సాధించింది. భాజపా 132 సీట్లు సొంతం చేసుకోగా.. శిందే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్‌సీపీకి 41 సీట్లు దక్కాయి. విపక్ష మహావికాస్ అఘాడీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. మహాయుతి ఈ స్థాయి మెజార్టీ సాధించినప్పటికీ.. సీఎం ఎంపిక విషయంలో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. ఈక్రమంలో శిందే, భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చలు జరిపారు. మరోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక విషయంలో మహారాష్ట్రలోని సామాజిక సమీకరణాలను భాజపా అధిష్ఠానం బేరీజు వేస్తున్నట్లు సమాచారం.

ఫడణవీస్ ముఖ్యమంత్రి రేసులో ముందున్నా మరో ఆలోచన పైనా భాజపా అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రి పదవిని ఏక్‌నాథ్ శిందే తిరస్కరించారని ఆయన సన్నిహితుడు ఒకరు తెలిపారు. క్యాబినెట్‌లో ఆయన భాగంగా ఉండాలని, అయితే సీఎంగా చేసి మళ్లీ ఉప ముఖ్యమంత్రిగా ఎలా చేయగలరని శివసేన ఎమ్మెల్యే సంజయ్ సిర్సాత్ అభిప్రాయపడ్డారు.




దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ భద్రతా వలయంలో మహిళా కమాండోలు ఉన్నారా..? ప్రస్తుతం నెట్టింట దీనిపై తెగ చర్చ జరుగుతోంది. భాజపా ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ షేర్ చేసిన ఓ ఫొటోనే దీనిక్కారణం..! పార్లమెంట్ వద్ద ప్రధాని నడుస్తుండగా ఆయన వెనక ఓ మహిళా భద్రతా సిబ్బంది కన్పించారు. ఈ చిత్రాన్ని కంగన తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. దీంతో ఈ ఫొటో కాస్తా వైరల్‌గా మారింది. దీనికి కంగన ఎలాంటి క్యాప్షన్ రాయనప్పటికీ.. ఆమె ప్రధాని భద్రతా బృందం అయిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌లో సభ్యురాలే అయి ఉండొచ్చని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. దీంతో ప్రధాని భద్రతలో మహిళా కమాండో ఉన్నారనే వార్త చక్కర్లు కొడుతోంది. అయితే, ఈ ఫొటో ఎప్పుడు తీశారన్నది తెలియరాలేదు గానీ.. దీనిపై భద్రతా వర్గాలు స్పందించాయి. కొందరు మహిళా ఎస్‌పీజీ కమాండోలు 'క్లోజ్ ప్రొటెక్షన్ టీమ్'లో సభ్యులుగా ఉన్నట్లు తెలిపాయి. అయితే, ఈ చిత్రంలో కన్పించిన మహిళ మాత్రం ఎస్‌పీజీ బృందంలో భాగం కాదని స్పష్టంచేశాయి. ఆమె రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు కేటాయించిన పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ అని తెలిపాయి. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నాయి. అయితే, ఆమె పేరు, ఇతర వివరాలను మాత్రం అధికారిక వర్గాలు పంచుకోలేదు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హత్య నేపథ్యంలో ప్రధానులు, వారి కుటుంబాల భద్రత కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే 1985లో ఎస్‌పీజీ ఏర్పాటైంది. ప్రస్తుత, మాజీ ప్రధానులు, వారి సమీప కుటుంబసభ్యుల భద్రతను ఈ బృందం పర్యవేక్షించేది. ఆ తర్వాత దీనిలో మార్పులు చేశారు. ప్రస్తుతం కేవలం పదవిలో ఉన్న ప్రధాని, ఆయన కుటుంబసభ్యులకు మాత్రమే ఈ భద్రత లభిస్తుంది.




రాష్ట్రంలో రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. లగచర్ల భూసేకరణ రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వికారాబాద్ జిల్లా లగచర్ల భూ వివాదంలో గిరిజనుల ఆందోళనకు ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు భూసేకరణ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మా విలేజ్ కోసం దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. భూ సేకరణ చట్టం 2013లోని సెక్షన్ 93 ప్రకారం ఉపసంహరించుకున్నట్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామాలలో ప్రజల అభిప్రాయ సేకరణ తర్వాత భూసేకరణ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటన చేశారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## సిద్దిపేటలో దీక్షా దివస్.. ఉద్యమం నాటి రోజులను గుర్తుచేసిన హరీశ్‌రావు



1956లో కుట్రలు చేసి సమైక్యాంధ్రలో తెలంగాణను విలీనం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆనాటి నుంచి తెలంగాణలో ప్రత్యే రాష్ట్ర ఆకాంక్ష అలాగే ఉన్నదని పేర్కొన్నారు. జయశంకర్ సార్ జీవితమంతా తెలంగాణ సిద్ధాంత ప్రచారానికే అంకితం చేశారని గుర్తుచేశారు. సిద్దిపేటలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ లాంటి వాళ్లు ఎవరో రాకపోతారా అని ఎదురుచూశారని తెలిపారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఇస్తామని కనీస ఉమ్మడి కార్యక్రమంలో రాస్తేనే కేంద్రంలో చేరతామని కేసీఆర్ ఆనాడు షరతు పెట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. సంప్రదింపుల ద్వారా తెలంగాణ ఏర్పాటుకు అంగీకరించారని తెలిపారు. రాష్ట్రపతి నోట తెలంగాణ మాట చెప్పించారని అన్నారు. తనకు కేంద్రమంత్రి పదవి అవసరం లేదని.. తెలంగాణనే కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కానీ సోనియాగాంధీ పట్టుబట్టడంతో కేసీఆర్ కేబినెట్‌లో చేరారని తెలిపారు. కానీ కేసీఆర్‌కు ఇచ్చిన బొగ్గు శాఖను డీఎంకే అడిగితే ఇచ్చేశారని పేర్కొన్నారు. ఏ శాఖ లేకుండానే కేసీఆర్ 8 నెలల పాటు కేంద్రమంత్రిగా ఉన్నారని తెలిపారు. తనకు ఏ శాఖ అవసరం లేదని.. తెలంగాణ ఇస్తే చాలని కేసీఆర్ పట్టుబట్టారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన పుస్తకంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. ఆనాడు వైఎస్ కుట్రలు చేసి, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గుంజుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణకు వ్యతిరేకంగా ఆంధ్రా ప్రజలను వైఎస్ రెచ్చగొట్టారని పేర్కొన్నారు. అప్పుడు టీడీపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకుని చంద్రబాబుతో జై కొట్టించారని అన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ మళ్లీ మోసం చేసిందని.. బీజేపీ కూడా ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని మోసం చేసిందని తెలిపారు. హైదరాబాద్ ఫ్రీజోన్ అని కేంద్రం చెప్పిందని తెలిపారు. ఫ్రీ జోన్ అంటే మన హైదరాబాద్ మనకు కాకుండా పోతుందని కేసీఆర్ ఒప్పుకోలేదని తెలిపారు. దీంతో 2009 అక్టోబర్ 12వ తేదీన సిద్దిపేటలో ఉద్యోగ గర్జన సన్నాహక సభ ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని కేసీఆర్ నినదించారని గుర్తుచేశారు. అక్టోబర్ 21న ఉద్యమ గర్జన అద్భుతంగా జరిగిందని తెలిపారు.

నవంబర్ 29న ఆమరణ దీక్ష చేస్తానని కేసీఆర్ ఆనాడు ప్రకటించారని చెప్పారు. అప్పుడు వేల మంది పోలీసులు మోహరించి దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నించారని.. రోజూ ఏదో ఒక సాకుతో టీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టారని, అరెస్టులు చేశారని అన్నారు. కేసీఆర్‌ను అలుగునూరు చౌరస్తా దగ్గర అరెస్టు చేసి ఖమ్మం తరలించారని తెలిపారు. ఆంధ్రా బార్డర్ ఖమ్మంలో ఉద్యమం ఉండదని అనుకున్నారని పేర్కొన్నారు. కానీ న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యార్థులు ఉప్పెనలా లేచారని గుర్తుచేశారు.

## సోనియా ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేదా..? భారాస ఆత్మవిమర్శ చేసుకోవాలి: మంత్రి పొన్నం



హనుమకొండ: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పట్ల కృతజ్ఞతతో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఆయన పర్యటించారు. కొత్త కొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. సోనియా గాంధీ ఇవ్వకపోతే తెలంగాణ ఏర్పడేదా అని భారాస ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. "తెలంగాణ సాధనకు ఎందరో బలిదానం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా పార్లమెంటులో ఆనాడు తెలంగాణ బిల్లు పెట్టారు. తల్లిని చంపి బిడ్డను ఎత్తుకుపోయారని ప్రధాని మోదీ ఆరోపించారు. ప్రధాని వ్యాఖ్యలపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో ఎందుకు వివక్ష చూపిస్తున్నారు" అని పొన్నం విమర్శించారు.

## తెలంగాణవ్యాప్తంగా ఘనంగా దీక్షా దివస్..




తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ జరుపుతున్నాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని రంగదాంపల్లిలో అమరులవీరుల స్థూపం దగ్గర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, ఇతర నేతలు దీక్షా దివస్ నిర్వహించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుగుతోంది. మెదక్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు జరుగుతున్నాయి. జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు.

## ఇథనాల్ కంపెనీకి అనుమతులు భారాస హయాంలోనే..
## వివరాలు బయటపెట్టిన ప్రభుత్వం




హైదరాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ఇథలాల్ కంపెనీకి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. భారాస హయాంలోనే అనుమతులు మంజూరు చేశారంటూ పలు పత్రాలను విడుదల చేసింది. "ఇథనాల్ కంపెనీకి భారాస హయాంలో అనుమతులు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. పర్యావరణ శాఖ పర్మిషన్లను ఉల్లంఘించి నిబంధనలను తుంగలో తొక్కారు. కేంద్ర ప్రభుత్వం ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ అనుమతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తులకు అప్పటి మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకుతో కంపెనీకి అనుకూలంగా పర్మిషన్లు ఇచ్చారు. మినహాయంపు కోసం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంపెనీ అడ్డదారులు అనుసరించింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం స్థానిక సంస్థలు ఎన్‌వోసీ తీసుకోవాలి. అలా చేయకుండానే పీఎంకే డిస్టిలేషన్స్ కాంపౌండ్ వాల్ నిర్మించింది. భారాస ప్రభుత్వ అండతో పీఎంకే డిస్టిలేషన్స్ నిబంధనలు ఉల్లంఘించింది. 2022 అక్టోబర్ 22న గత ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇండెంట్ జారీ చేసింది. 600 లక్షల లీటర్ల ఇథనాల్, ఇతర ఉత్పత్తుల కోసం గత ప్రభుత్వం ఎల్‌వోఐ జారీ చేసింది" అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

## పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట



హైదరాబాద్ : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, భారాస నేత పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లలో రెండింటిని కోర్టు కొట్టేసింది. లగచర్ల దాడి ఘటనలో బొంరాస్‌పేట పోలీసులు 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని నరేందర్ రెడ్డి ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. దీనిపై కోర్టు తీర్పును రిజర్వ్ చేసి నేడు ఉత్తర్వులు ఇచ్చింది.

## యాదాద్రిలో గిరి ప్రదక్షిణ.. భారీగా తరలివచ్చిన భక్తులు



యాదగరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం.. స్వాతి సందర్భంగా శుక్రవారం వేకువ జామున గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. భక్తుల జయ జయ నినాదాలు, భక్త సమాజాలు, మహిళల కోలాటాలతో సందడిగా మారింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఆలయ ఈవో భాస్కరరావు సమక్షంలో వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. మరికొందరు మెట్లెక్కి కొండపైకి చేరుకుని, దైవదర్శనం చేసుకున్నారు. పరిసరాల్లో భక్తి సమాజాలు ,ధార్మిక సంస్థలకు చెందిన భక్తులు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

## డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం



జోగిపేట టౌన్: సంగారెడ్డి జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. ఆందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉండగా.. వారిలో 20 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నారాయణఖేడ్ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు నారాయణఖేడ్ నుంచి జోగిపేటకు వెళ్తుండగా.. కన్సాన్‌పల్లి గ్రామ శివారులో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com